5.8.57

సంపుటము 11, సంచిక 193

Regd H No 45 Estd 1925

గోలకొండపత్రిక

హైదరాబాదు సోమవారము
5 - 8 - 1957

సంపాదకుడు: ఎస్.నరోత్తమరెడ్డి ఎం.ఎ.

4 పేజీలు
7 నయాపైసలు

100578

కాంగ్రెస్ పేరు భారత సోషలిస్ట్ కాంగ్రెస్‌గా మార్చాలని ఒక సూచన

పూనా, ఆగస్టు 4 భారత జాతీయ కాంగ్రెస్ పేరును భారత సోషలిస్టు కాంగ్రెస్ అని మార్చాలని యీవేళ మహారాష్ట్ర పి సి సి సమావేశంలో ఒక సూచన రాగా పలువురు ప్రముఖులు సుముఖతను వెల్లడించారని తెలుస్తున్నది అసలు కాంగ్రెస్ ఆశయం సామ్యవాద వ్యవస్థ నిర్మించడమే కావున పేరును భారత సోషలిస్టు కాంగ్రెసుగా మార్చితే చాలా సబబుగా ఉంటుందని ఈ సూచన ప్రతిపాదకులు తమ అభిప్రాయాన్ని వెలిబుచ్చారట

రాజ్యసభ తక్షణ సమావేశానికై నల్గురు ఎం. పి. ల అభ్యర్థన

నాగపూర్, ఆగస్టు 4 ప్రస్తుతం లోకసభలో ప్రవేశపెట్టబడిన అత్యవసర సర్వీసుల బిల్లును చర్చించకుండా ఆర్డినెన్స్ ద్వారా అమలు జరిపించేరన్న తగు వివరాలతో చర్చించడానికి అనువుగా తక్షణమే రాజ్యసభ ప్రత్యేక సమావేశాన్ని యేర్పాటు చేయవలసిందని నేడు శ్రీ ఎం డి తువల్లినార్, రాజభావుడాంగ్రే, డా॥ డబ్ల్యు ఎస్ బార్లింగే, జస్వంత్‌రాయ్ కపూర్ (రాజ్యసభా సభ్యులు) యీవేళ రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్‌ను ప్రధాని నెహ్రూను కోరుతూ టెలిగ్రాంలు పంపారు

సమ్మె ఖాళీల్లో పనిచేయడానికి రాష్ట్ర ఎన్.జి.ఓల నిరాకరణ

సంస్కృతభాషా పునరుద్ధరణ ఈ తరం వారివిధి

సనత్‌నగర్‌లో సంస్కృత పాఠశాలను ప్రారంభిస్తూ విద్యామంత్రి ఉద్బోధ

"హిందీగాని, సంస్కృతంగాని తెలుగును అధిగమించవు"

హైదరాబాద్, ఆగస్టు 4

స్వాతంత్ర్య సముపార్జనతో సంస్కృత భాషాభ్యసనం నేటితరం వారి ధర్మమైంది, దేశభాషలకెల్ల మాతృస్థానంలో నిలిచిన సంస్కృతాన్ని పునరుద్ధరించాలి అనిరాష్ట్ర విద్యామంత్రి శ్రీ ఎస్ బి పి పట్టాభి రామారావు యీఉదయం సనత్‌నగర్ రిక్రియేషన్ క్లబ్బులో శ్రీ శ్రీనివాస సంచార సంస్కృత విద్యాలయానికి ప్రారంభోత్సవం కావిస్తూ ఉద్బోధించారు

అయినా సంస్కృతంకాని, హిందీగాని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాధికార భాషఅయిన తెలుగు ప్రాముఖ్యాన్ని కొంచెపరచజాలవు అని విద్యామంత్రి ఉద్ఘాటించారు కూడా. సంస్కృతం అభ్యసించి గోరేవారికి ప్రభుత్వం పూర్తిసహాయం కావించగలదు అంతేకాని సంస్కృతాన్ని తప్పక చదవాలని నిర్బంధించజాలదు. అసలు ట్రైలింగ్వల్ ఫార్ములా ప్రకారం భాషలు రాష్ట్రంలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ఇంగ్లీషుభాష యూనివర్సిటీల్లో బోధనా భాషగా ఉండాల్సి ఉంది ఏమైనా త్వరపడి నిర్ణయాలు తైకోడంకూడదు అని శ్రీపట్టాభి రామారావుఅన్నారు

టెక్నాలజీ పరిశోధన కేంద్రాలు

భారత ప్రభుత్వం నాల్గు టెక్నాలజీ పరిశోధన కేంద్రాలను స్థాపించదలిచిందనీ, అందొకటి దక్షిణాపథాన ఏర్పాటు కాగలదనీ యీసందర్భంగా విద్యామంత్రి వెల్లడించారు భారతీయ భాషలలో వ్యవహారం నిర్వహించ వీలైనంత సాంకేతిక పారిభాషిక పదజాలంలేనందున పని ఇంగ్లీషులోనే నడవాల్సి ఉంటుంది. ఒక్కొక్క కేంద్రంలో 2 వేల మందికి విద్యగరపబడుతుంది, దాదాపు 750 కుటుంబాలు స్థిరపడుతాయి ఇంగ్లీషుభాషా సమస్యను తేల్చగలిగినది అంతర్విశ్వవిద్యాలయ సమావేశం అని ఆయన పేర్కొన్నారు.

పరీక్షల వ్యవహారం

పరీక్షలవల్ల మంచికన్న చెడేఎక్కువ జరుగుతున్నందున పరీక్షలను కట్టిపెట్టాలని కొందరు సూచిస్తున్నారని విద్యామంత్రి ప్రస్తావిస్తూ వాటిని తొలగిస్తే విద్యార్థుల అభిమాన విషయాల్లోనే వారి వారి సామర్థ్యాలను ప్రమాణీకరించే వ్యవస్థ ఏర్పడే రేలేదని అన్నారు

సమాచారశాఖ అసిస్టెంట్ డైరెక్టరు శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి ప్రసంగిస్తూ స్వచ్ఛమైన తెలుగుభాష శ్రేయస్సుదృష్ట్యా సంస్కృత భాషా వ్యాప్తి అత్యవసరమన్నారు వెనుకటి హైదరాబాద్ రాష్ట్రంలో తెలుగు భాషపట్ల చూపబడిన సవతితల్లి ప్రేమ నాయన వివరించారు ఈనాడు పరిస్థితులు మారాయి, తెలుగుభాషాభివృద్ధికి అవకాశాలు అధికమౌతున్నాయి తెలుగు భాషాభ్యున్నతికి ఆంధ్రప్రదేశ్ అవతరణ మరింత దోహదపడుతున్నదని ఆయనన్నారు హైదరాబాదులో సంస్కృత విద్యా సమితి కృషినాయన వివరిస్తూ దాని తరపున 14 పాఠశాలలు నడుస్తున్నాయనీ, సనత్ నగర్‌లో, మల్లేపల్లిలో మరో రెండు పాఠశాలలు ఉండగలవనీ గరీబ్‌నగర్‌లో సంస్కృతం నేర్చుకోదలిచిన వారి సౌకర్యార్థం అక్కడ మరో పాఠశాల ఏర్పాటు చేయబడుతుందనీ చెప్పారు సంస్కృత భాషను ఎవరైనా ఆరు నెలల్లో నేర్వవచ్చునని శ్రీ లక్ష్మణశాస్త్రి ధైర్యం గరపారు

సనత్‌నగర్ ఎన్ జి ఓ ల అసోసియేషన్ కార్యదర్శి శ్రీ రామమూర్తి మంత్రిని ఆహ్వానించారు శ్రీ కె వి నరసింహాచార్యులు నివేదిక సమర్పించారు ఎన్. జి ఓ ల సంఘాధ్యక్షుడు శ్రీ సింగరాచారి వందన సమర్పణ కావించారు

(ఎ-ఎన్-ఎస్)

సహకార వ్యవసాయ ప్రయోగ పథకం

ప్రతి జిల్లాకు ఒక గ్రామంలో అమలు జరపాలని రాష్ట్ర నిర్ణయం

హైదరాబాదు, ఆగస్టు 4

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సహకార వ్యవసాయం ఎంతవరకూ అధికోత్పత్తికి సాయపడగలదో పరిశీలించేందుకు రాష్ట్రప్రభుత్వం తలపెట్టిందనీ, యిందుకు సంబంధించిన ఒక స్కీమును ప్రయోగించి చూడదలుస్తున్నదనీ ఎ ఎన్ ఎస్, విలేఖరి తెలుపుతున్నాడు

ఈ సహకార వ్యవసాయం ప్రయోగించి పరిశీలించేందుకు ప్రతిజిల్లాకు ఒక పూర్తి గ్రామాన్ని కేటాయించి ఆ గ్రామం వివరాలన్నీ అందజేయవలసిందిగా అన్ని జిల్లాల కలెక్టర్లకూ ఆదేశాలివ్వబడ్డాయట

రోడ్ వర్కర్ల ఊరేగింపు

హైదరాబాద్, ఆగస్టు 4

పి డబ్ల్యు డి రోడ్ వర్కర్లు ప్రభుత్వోద్యోగుల జాబితా క్రిందికి రారు అనే హేతువుతో యీమధ్య రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిన రు 6 అదనపు భృతిని తమకు ఆవిచేసినందుకు ఆక్షేపణ తెలుపుతూ నేడు రోడ్ వర్కర్లు కమ్యూనికేషన్ల మంత్రి శ్రీ మందుముల నరసింగరావు ఇంటికి ఊరేగింపు తీశారు.

పేజీ-ధర గరిష్ఠ పరిమితుల నిర్ణయం

వార్తా పత్రికల ప్రచురణ కర్తలకు కేంద్రం నిజ్ఞప్తి

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఈవేళ కేంద్ర సమాచార ప్రసారశాఖ కార్యదర్శి శ్రీ ఆర్ కె రాంధ్యానీ అధ్యక్షతన ఏర్పాటు చేయబడిన వార్తాపత్రికా ప్రచురణ కర్తల సంస్థల ప్రతినిధుల సమావేశములో రాష్ట్రపతి అంగీకారం పొందిచట్టంగా రూపొందిన న్యూస్ పేపర్ (పేజీ-ధర) చట్టం 1956కు సంబంధించిన అంశాలు అనేకం చర్చించబడ్డాయి

పత్రికల్లో ప్రకటనకు కేటాయింపబడే చోటు ఇతర వార్తా సంఘటనలకు కేటాయించబడే చోటుల నిష్పత్తి దృష్ట్యా పేజీ-ధర షెడ్యూలు నొకదానిని సర్వాంగీకారంతో సమర్పించడానికి నేటి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు అంగీకరించారు, న్యూస్ పేపర్ (పేజీ-ధర) చట్టం పత్రికల మధ్య విషమమైన పోటీలను నిరోధించి చిన్న పత్రికలను పరిరక్షించే ఉద్దేశంతో ఏర్పాటయింది

శ్రీ రాంధ్యానీ నేటిసమావేశంలో మాట్లాడుతూ న్యూస్ పేపర్ (పేజీ-ధర) చట్టాన్ని ప్రభుత్వం పత్రికల వారితో సంప్రదించినదే అమలు పరచదలచలేదనీ కనీసపు పేజీలు కనీసపు ధరలను ప్రభుత్వం నిర్ణయించడానికి తలపెట్టడంలేదనీ కాని గరిష్ఠ సంఖ్య పేజీలను గరిష్ఠ ధరను నిర్ధారించవలసిన అవసరం ఉందని ప్రభుత్వం భావిస్తున్నదనీ కాగా సయాజీ రావు తెర్కలో ఇందు కనువైన షెడ్యూలును సూచించవలసిందనీ కోరారు

ప్రస్తుతం యీ చట్టం దిన పత్రికలకు మాత్రమే అనువర్తిస్తుంది

పంజాబ్ శాసన సభ్యుని హత్య

అంబాలా, ఆగస్టు 4

లూధియానాలో నేటి మధ్యాహ్నము 1-30 లకు స్వగృహములో ఉండగా కాంగ్రెస్ శాసనసభ్యుడు ఎస్ వజీర్ సింగ్‌ను ఎవరో కత్తితో పొడిచి చంపారు హత్య చేసినట్లు ఆరోపింపబడిన ఆ యింటి సేవకుని పోలీసులు అరెస్టు చేశారు

కొత్త పార్లమెంటరీ కార్యదర్శి

న్యూఢిల్లీ, ఆగస్టు 4

లోక్ సభ సభ్యుడు శ్రీ ఫతేహ్ సిన్హారావు ప్రతాప్ సిన్హారావు గయిక్వాడును కేంద్ర రక్షణ మంత్రి యొక్క పార్లమెంటరీ కార్యదర్శిగా భారత ప్రధాని నియమించారు.

సమ్మెల కిప్పుడు సమయం కాదు

ఐ. ఎన్. టి. యు. సి. రాష్ట్ర శాఖ తీర్మానం: అవసరమైతే సాయపడేందుకు కడపలో లాయార్ల సంసిద్ధత కూడా

హైదరాబాద్, ఆగస్టు 4

తంతి తపాలాశాఖ ఉద్యోగులు మరి కొందరు కేంద్రప్రభుత్వోద్యోగులు బుధవారంనాటి అర్ధరాత్రి ముహూర్తంనుండి ప్రారంభించనున్న సమ్మె యథార్థరూపం ధరించే పరిస్థితిలో రాష్ట్రప్రభుత్వంక్రింద పనిచేస్తున్న ఉద్యోగులు అధికారులూ దేశించినా కూడా కేంద్రోద్యోగుల సమ్మెశాఖల్లో పనిచేయరాదని హైదరాబాదు ఎన్-జి-ఓల సంఘం తీర్మానించింది. మద్రాసు ఎన్-జి-ఓలు కూడా ఇదే తీర్మానం కావించారు

రాష్ట్ర ఐ-ఎన్-టి-యు సి- నిన్న సమావేశమై ఉద్యోగుల కోర్కెలను సానుభూతిలో గమనించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రస్తుత దేశపరిస్థితిలో సమ్మెలకు ఇది సమయంకాదని తీర్మానించింది.

ఇండియన్ నేషనల్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్ నారాయణగూడా కార్యాలయంలో నిన్న 28 నగర ట్రేడ్‌యూనియనుల అధ్యక్ష కార్యదర్శులు సమావేశమై ఆగస్టు 8 వ తేది అర్ధరాత్రినుండి ప్రారంభింపతలపెట్టబడిన తంతి తపాలాశాఖవారు మరితర కేంద్ర ప్రభుత్వోద్యోగుల సమ్మెకు ఇది తగునసమయంకాదనీ, బహిరంతర రంగాల్లో దేశం అనేక కష్టాల నెదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో యీ సమ్మె జాతిజీవనాన్ని దెబ్బతీయగలదనీ అభిప్రాయం వెల్లడిస్తూ తీర్మానించారు, కేంద్రప్రభుత్వం యీ ఉద్యోగుల డిమాండ్లపట్ల సానుభూతితో వ్యవహరించాలనికూడా ఆ తీర్మానములో పేర్కొనబడింది

యాజమాన్యంలో కార్మికుల భాగస్వామ్యాన్ని గురించిన ఒక తీర్మానములో ఇందుకు సత్వరచర్యలు తీసుకోడానికి ప్రభుత్వం అంగీకారం తెలిపినందున అభినందనలు తెలుపబడ్డాయి ఇప్పుడిక యీ పరంగా కార్మికులకు శీఘ్ర నివ్వాలి సరైన చర్యలు గైకొనబడితే జాతి పిత ఆశించిన వ్యవధికన్న ముందుగా సేలక్ష్యంసిద్ధించగలదని తీర్మానం పేర్కొంటున్నది

వేతన నిర్ణాయక సంఘాల నివేదికలపై హనుమంతరావు కమిటీ రిపోర్టును ప్రభుత్వం ప్రకటించనందుకు నిరసన తెలుపుతూ అన్ని యూనియన్లూ యిందుకు ప్రభుత్వంమీద నైతికమైన ఒత్తిడి తేవాలని తీర్మానించబడింది

ఐ ఎన్ టి యు. సి వర్కింగ్ అధ్యక్షుడు శ్రీ జి సంజీవరెడ్డి ప్రసంగిస్తూ పటిష్ఠమైన ట్రేడ్ యూనియన్ వర్కర్ల కేడర్‌ను సృష్టించాల్సిన ఆవశ్యకతను పేర్కొన్నారు.

హనుమంతరావు కమిటీ నివేదిక ప్రచురింపబడనందుకాయన ఆక్షేపణ తెలిపారు కేంద్రోద్యోగుల కోర్కెలు సక్రమమైనవైనా సమ్మె ప్రస్తుత పరిస్థితులకు తగనిదని ఆయన వివరించారు

జి వెంకటస్వామి (ఎం ఎల్. ఏ), ఆర్ బాబు ఎ ఆర్ వీరాస్వామి గార్లుకూడా ప్రసంగించారు

కడప బార్ అసోసియేషన్ నిరసన

తంతి తపాలా శాఖోద్యోగులు ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు తలపెట్టిన సమ్మె విధ్వంసకరమైనదని పేర్కొంటూ కడప బార్ అసోసియేషన్ నేడొక నిరసన తీర్మానము కావించింది శ్రీ జె విచ్చయ్య అధ్యక్షతన జరిగిన యీ సమావేశములో సమ్మె పరిస్థితిలో తమ బార్ అసోసి

(4 వ పేజీ చూడుడు)

కేరళలో కొంత పోస్టాఫీసు పని ఎన్. జి. ఓలచే నిర్వహింపజేసే ఏర్పాట్లు

త్రివేంద్రం, ఆగస్టు 4

ఆంధ్ర ప్రదేశ్, మద్రాసు రాష్ట్రాల్లో ఎన్. జి. ఓ లు తంతి తపాలావారి సమ్మె సందర్భంగా ఆదేశింపబడినా ఆ పనులు చేయరాదని నిర్ణయించుకోగా కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వము మాత్రం సెక్రటేరియట్‌లోనే సగం ఉత్తరాల సార్టింగ్, ప్యాకింగ్ పనినిపూర్తిచేసి పంపవలసిన ఉత్తరాలను నిర్ణీత పోస్టాఫీసులకుఅందజేసేయేర్పాట్లుచేసింది.

అంటే, కేరళ సెక్రటేరియట్‌లో పనిచేసే ఎన్ జి ఓలు తమ తమ శాఖలకు సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ అవి చేరవలసిన ప్రదేశాలకు కట్టలు కట్టలుగాకట్టి సార్టుచేసి నిర్ణీత పోస్టాఫీసులకు అందజేస్తారు కాగా పోస్టాఫీసులో జరుగవలసినపని పరోక్ష పద్ధతిని ఎన్ జి ఓల చేతనే చేయించడానికి కేరళ ప్రభుత్వం అన్నిఏర్పాట్లు చేసినట్లు నేడు వార్త వెల్వడింది టెలిగ్రాఫ్ ఏర్పాట్లు చెడిపోతే పోలీసు వైర్‌లెస్ శాఖను వినియోగించుకోడానికి కేరళప్రభుత్వం నిర్ణయించింది అన్నిచోట్లా విధ్వంస చర్యలేమీ జరుగకుండా పోలీసు కాపలా ఏర్పాటవుతున్నది కూడా

తూర్పు కృష్ణాజిల్లా
యన్. జి ఓ. లసంఘం

బందరు, ఆగస్టు 4

లూర్పు కృష్ణాజిల్లా యన్ జి ఓల సంఘం మహాసభ 28-7-57 తేదిన టౌను, హాలులో జరిగెను ఉదయం 8 గంటలకు సంఘం అధ్యక్షులు శ్రీయుత ఎ వి వెంకటరత్నంగారు పతాకోత్సవం జరిపిరి. తరువాత సభ్యులు అట్టలమీద వ్రాయబడిన కోరికలు చేతపట్టుకొని, పెద్ద వూరేగింపుగా బయలుదేరి 9 గంటలకు విషయ నిర్ణయసభ శ్రీ వెంకటరత్నంగారి అధ్యక్షత క్రింద జరిగెను

సాయంత్రము 3 గంటలకు ఆంధ్రప్రదేశ్ యన్ జి ఓస్ సంఘం అధ్యక్షులు, శ్రీ ఎ సత్యనారాయణగారి అధ్యక్షత క్రింద బహిరంగ సమావేశం జరిగెను కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీయుత ఎ చంద్రశేఖర్‌గారు మహాసభ ప్రారంభోత్సవము జరిపిరి శ్రీ వి వి సోమయాజులు గారు (సంఘం కార్యదర్శి 1956 నుంచి జరిగిన కార్యకలాపాలు సమీక్షచేస్తూ నివేదికను చదివిరి

నూతన సంవత్సరానికి శ్రీ ఎ వెంకటరత్నం గారిని అధ్యక్షులుగను, శ్రీ కె రామచంద్రశాస్త్రి గారిని ఉపాధ్యక్షులుగను శ్రీ పి వి సోమయాజులుగారిని కార్యదర్శిగను,యన్ వెంకటరత్నం గారిని జాయంటు కార్యదర్శిగను పి గోపాలకృష్ణయ్యగారిని కోశాధికారిగను ఎన్నుకొనిరి సుమారు 16 మందితో కూడిన ఒక కార్యనిర్వాహక వర్గమునుకూడా ఎన్నుకొనిరి శ్రీయుతులు ఏ శ్రీరాములు, పద్మనాభన్ (హైదరాబాదు సిటీ సెంటరు కార్యదర్శి), సుబ్రహ్మణ్యం (హైదరాబాదు) గార్లు ఉపన్యసించిరి

సంఘం వారికోరికలను పునరుద్ఘాటిస్తూ తీర్మానములు చేయబడెను

కలల విజయానికి గ్రామాభ్యుదయం

దీక్షతో సాధించబడాలని ఆదిలాబాదు జిల్లా సెమినార్‌లో మంత్రి శ్రీ జె.వి. ఉద్ఘాటన

ఆదిలాబాద్, ఆగస్టు 4

"ఎల్లరూ సమానహక్కులు, సమానావకాశాలతో కూడిన మన సంక్షేమ రాజ్యాన్ని గురించిన కలలు యీ ప్రజాస్వామ్య రాజ్యంలో ఫలించాలంటే స్వాతంత్ర్య విప్లవంలోని రెండో ఘట్టాన్ని విజయవంతంగా అమలు జరుపుతూ 558000 గ్రామాల పరిస్థితులను బాగుపరచాలి" అని రాష్ట్రఇరిగేషన్ విద్యుచ్ఛక్తిశాఖల మంత్రి శ్రీ జె వి నరసింగరావు ఆదిలాబాద్‌జిల్లా ప్రథమ అభివృద్ధి గోష్ఠిని ప్రారంభిస్తూ అన్నారు

శుక్రవారంనాడు ప్రారంభమైన యీ అభివృద్ధి గోష్ఠి నేటితో ముగిసింది దీనికి పంచాయతుల ప్రతినిధులు, ఎన్ ఇ ఎస్ బ్లాకుల సలహా సంఘాల సభ్యులు, జిల్లా అధికారులు, అడిషనల్ డెవలప్‌మెంటు కమిషనర్ శ్రీ సి నరసింహం, డిప్యూటీ డెవలప్‌మెంట్ కమీషనర్ (ప్లానింగ్) శ్రీ రామిరెడ్డి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు

జిల్లా కలెక్టరు స్వాగతోపన్యాసమిచ్చారు

మంత్రి శ్రీ జె వి నరసింగరావు ప్రారంభోపన్యాసమిస్తూ దేశంలోని శత్రుత్రయం - దారిద్ర్యం, అనారోగ్యం, అజ్ఞానం-పై విజయం సాధించాలంటే మన మౌన విప్లవాన్ని కొనసాగించవలసిన దృఢ రీతి అవసరమని ఉద్బోధించారు గ్రామాల ప్రజలు తమ పాతభావాలు విడనాడి నవీన రీతులకు అలవాటు పడాలనీ, సామ్యవాద రీతి వ్యవస్థా నిర్మాణమే మన లక్ష్యం కావున, జీవితంపట్ల దృక్పథాన్ని మార్చుకొని వ్యక్తిగతంగాక సమష్టిగతంగా ఆలోచించాలనీ శ్రీ నరసింగరావు పేర్కొన్నారు గ్రామస్థుల సమస్యలను అవగతం చేసుకోవాలంటే, అధికారులు వారితో కలిసి మెలసి వ్యవహరించాలని ఆయన కోరారు లేకుంటే గ్రామస్థులకు సరైన సహాయం చేయడం కష్టతరం కాగలదనీ, యీనాడు ప్రభుత్వోద్యోగి నిజమైన ప్రజాసేవకుడుగా వ్యవహరించాలనీ, ప్రజలుకూడా అధికారులపట్ల తమ పూర్వాభిప్రాయాలను వర్జించి సమాధాన దృష్టితో మెలగాలనీ శ్రీ జె వి నరసింగరావు కోరారు

వివిధ విషయాలపై చర్చల నిమిత్తం సమావేశం నాల్గు విభాగాలుగా తిరిగి సమావేశమైంది

ఆ సాయంత్రం మంత్రి శ్రీ నరసింగరావు ఆ ప్రాంతపు పంచాయతుల్లో ఉత్తమంగా ఎన్నికైన పంచాయతుల అధ్యక్షులకు బహుమతులు అందజేశారు లక్సెట్టిపేట ఎన్-ఇ-ఎస్ బ్లాకు సాంస్కృతిక సంఘంవారి ప్రదర్శనలనుకూడా ఆయన తిలకించారు

గుంటూరువద్ద పోలీసు హత్య

ఒక పాతకేడీని పట్టుకోబోగా

గుంటూరు, ఆగస్టు 4

గుంటూరు జిల్లా చందవేలి అను గ్రామములో గతరాత్రి యోహాను అను పోలీసు కానిస్టేబులు హత్య కావించబడ్డాడు

హంతకుడు అబ్బూరి సీనయ్య అను నాతడు పోలీసులకు చిక్కకుండా పారిపో ప్రయత్నించగా పోలీసులు యెదిరించిన సందర్భంగా యీ హత్య జరిగింది సీనయ్య అనేక దొంగతనాలకు సంబంధించి పోలీసులచే వెతకబడుతున్న వ్యక్తి

పూర్తి పోలీసు లాంఛనాలతో రేపు కానిస్టేబుల్ అంత్యసంస్కారాలు జరుగుతాయి

గృహనిర్మాణాలకు భూముల ధరల స్థిరీకరణ

రాష్ట్రాలు తగు శాసనాలు చేయాలని ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుని సూచన

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ప్రతి రాష్ట్రంలోనూ గృహనిర్మాణ పథకాలకు ఆర్థికసహాయం అందజేయగల అధికారాలతో గృహనిర్మాణ సంఘాలను నెలకొల్పాలని కేంద్ర ప్లానింగ్ మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా అధ్యక్షతన నిన్న సమావేశమైన ప్లానింగ్ కమిషన్ యొక్క గృహనిర్మాణ ప్రాంతీయ ప్లానింగ్ పానెల్ ఒక ప్రధానమైన సూచన కావించింది

ఈ బోర్డుల్లో యెవరెవరుండాలో, యేయే నిబంధనలతో యే రాష్ట్రాలలో కేంద్రం నమూనా శాసనం తయారుచేసి రాష్ట్రాలకు మార్గదర్శకత్వంనిమిత్తం సంపుతుంది

ఈ సమావేశానికి ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు శ్రీ వి టి కృష్ణమాచారి, కేసి నియోగి, డా॥ జె సి ఘోష్, ప్లానింగ్‌శాఖ డివ్యూటీ మంత్రి ఎస్ ఎన్ మిశ్రా హాజరయ్యారు

శ్రీ నందా తన ప్రసంగంలో సాంఘిక సంక్షేమవ్యవహారాలలో ప్రధాన ప్రగతి ప్రమాణంగా ఎన్నదగిన గృహవసతి కల్పనా విషయంలో ప్రభుత్వం అధికంగా శ్రద్ధ వహిస్తున్నదన్నారు ప్రథమ ప్రణాళికలో సహకార సంఘాలు, సంస్థల యజమానులు రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గృహనిర్మాణ కార్యక్రమాలు నిర్వహింపబడ్డాయి కాని యిది సరిపోదని శ్రీ నందా అన్నారు, ఇక రెండో ప్రణాళికలో గృహనిర్మాణ కృషిని ప్రస్తావించి శ్రీ నందా యీమధ్య జరిగిన ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సూచనలను వివరించారు ప్రతి యజమాని తగినన్ని ఇండ్లు తన క్రింది కార్మికులకోసంకట్టించాలని యీ కాన్ఫరెన్స్‌లో సూచించబడింది, ఈ సూచనను కార్యరూపేణా సాధించడానికి ప్రభుత్వ యంత్రాంగం నిర్మాణం కావాలని శ్రీ నందా పేర్కొన్నారు గత 18 నెలలుగా గ్రామాలలో గృహాలనిర్మాణము విషయం తీవ్రంగా ఆలోచింపబడింది కాని వరద ప్రాంతాలు, పూర్తిగా జనసమ్మర్దం అధికమైన గ్రామాలు, వెనుకబడిన ప్రాంతాల వంటివాటికి ప్రాధాన్యంయిస్తూ యీ పథకం అమలు జరుపకపోతే ఒక్కసారి గ్రామీణ గృహనిర్మాణం చేపట్టేందుకు తగినంత ధనసంపత్తి లేదని శ్రీ నందా వివరించారు గృహనిర్మాణం శీఘ్రతను, పరిశోధనను ఆయన సూచించారు మొదటి ప్రణాళికలో కన్న మూడురెట్లు -120 కోట్లు యీ ప్రణాళికలో గృహనిర్మాణానికి కేటాయించాం దాని వినియోగమే ముఖ్య విషయం అని ఆయన పేర్కొన్నారు

ఉపాధ్యక్షుడు శ్రీ వి టి కృష్ణమాచారి మాట్లాడుతూ రాష్ట్రములు ప్రతి పెద్ద పట్టణంలోను గృహనిర్మాణ సంఘాలు యేర్పరచి, మాస్టర్ ప్లాన్‌లు తయారు చెయ్యాలన్నారు ప్రస్తుతం వివిధశాఖల ద్వారా సాగుతున్న గృహనిర్మాణ కృషి సమైక్యపరచబడవలసిన ఆవశ్యకతను ప్రస్తావించి ఆయన రాష్ట్ర ప్రభుత్వాలు భూముల ధరలను స్థిరీకరిస్తూ శాసనాలు చేయాలని కోరారు

గృహనిర్మాణం మురికివాడల నిర్మూలనకుసంబంధించి ఏర్పాటైన ఉపసంఘ నివేదికకూడా యీ సమావేశంలో పరిశీలించబడింది పారిశ్రామిక గృహనిర్మాణాలకు చెందజేయవలసిన ఆర్థిక సహాయం ఋణసహాయం విషయాల్లో ఆలస్యాలు లేకుండా చూడాలనీ గృహనిర్మాణాలకే సరిపడే స్థలం లేనివోట్ల ఫ్యాక్టరీల నిర్మాణానికి అనుమతించరాదనీ భూమిని స్వాధీనపరచుకొనే శాసనాల నిబంధనలను సడలించి భూముల విలువలను స్థిరీకరించాలనీసూచనలను యీ సమావేశం ఆమోదించింది.

మురికివాడల నిర్మూలన పథకాలు కూడా ఆలోచింపబడ్డాయి

బొంబాయి కార్మికులు సానుభూతి సమ్మెచేయాలని పిలుపు

నగర కార్మిక సంస్థల ప్రతినిధుల తీర్మానం

బొంబాయి, ఆగస్టు 4

"ఉద్యోగులపట్ల ప్రభుత్వం అనుసరించదలచిన నియంతృత్వ దమననీతిని ప్రతిఘటించి ఓడించేందుకు" మొత్తం కార్మికులోకమంతా ఏకోన్ముఖముగా ఉద్యమించడానికి అన్ని ట్రేడ్ యూనియనుల సంస్థలూ తక్షణమే సమావేశం కావాలనీ, తరువాత ప్రకటింపబడే ఒక తేదీనాడు కేంద్ర ఉద్యోగుల సమ్మెకు సానుభూతిగా ఒకరోజు సమ్మెజరపాలనీ బొంబాయి నగర వివిధ కార్మిక సంస్థల ప్రతినిధులు నేడు సమావేశమై పిలుపునిచ్చారు .

హింద్ మజ్‌దూర్ సభ,ఆలిండియా ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, యునైటెడ్ ట్రేడ్‌యూనియన్ కాంగ్రెస్, బ్యాంకులు, ఇన్సూరెన్స్ కార్పొరేషన్, రక్షణశాఖ, రేవు పనివారలు తపాలా పనివారలు, ఉద్యోగుల ఫెడరేషన్ల ప్రతినిధులు నేటి యీ సమావేశంలో పాల్గొన్నారు

లోకసభలో ప్రవేశపెట్టబడిన అత్యవసర సర్వీసులబిల్లు కార్మికుల హక్కులను ట్రేడ్ యూనియన్ ఉద్యమాన్ని అణచడానికి సమ్మెచేసే ప్రాథమిక హక్కును నిరాకరించడానికి ఉద్దేశింపబడినదనీ అందుకు దాన్ని తీవ్రంగా నిరసిస్తూ నేడొక ఏకగ్రీవ తీర్మానం కావించబడింది ఈ బిల్లు ప్రవేశపెట్టినంతమాత్రాన కేంద్రోద్యోగులుసమ్మె తలంపునువిరమించదనీధైర్యంతోఎదుర్కొంటారనితీర్మానంలోఆశించబడింది

ఆగస్టు 8వ యీ బిల్లును వ్యతిరేకంగా ప్రదర్శనలు జరుపుతారట

నిద్రిస్తున్న మిత్రుని జుట్టుకోసిన బాలుడు

అమృతసర్ మేజస్ట్రేట్‌చే శిక్ష విధింపు

అమృతసర్, ఆగస్టు 4

బలదేవ్ రాజ్ అను 12 సంవత్సరాల కుర్రవానికి స్నేహితుడు అజిత్‌సింగ్ అను నాతడు నిద్రిస్తుండగా అతని జుట్టు కత్తిరించివేసిన నేరానికి ఐ-సి-సి 295 సెక్షన్ ప్రకారం నగర మేజస్ట్రేట్ శిక్ష విధించారు ఒక ఏడాది వరకు సత్ప్రవర్తనకు పూచీకత్తును కూడా సిఆర్ సి సి 592 సెక్షన్ ప్రకారం మేజస్ట్రేట్ ఆ కుర్రవాని నుండి కోరారు ఇందుకై వెయ్యి రూపాయలు పూచీకత్తు ధనంగా నిర్ణయించారు

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనము

ముకరం జాహిరోడ్ : హైదరాబాద్ (ద)

ఎగ్జిబిషన్ గ్రౌండ్సులో ఉన్న పశువులమేయు స్థలము గురువారము (8-8-1957) నాడు సా॥ 5-30 గం॥లకు హైదరాబాద్ (ద) ముకరంజాహిరోడ్‌లో ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్సుయందు వేలం వేయబడును పాట పెట్టదలచినవారు ఎగ్జిబిషన్ కార్యాలయము నుండి వివరములు పొందగలరు

By Appointment with His Excellency
THE GOVERNOR OF ANDHRA PRADESH

జి. పుల్లారెడి నేతిమిఠాయి వ్యాపారము

ప్రొప్రయిటరు : శ్రీ వెంకటేశ్వర బేకరీ
(కర్నూలు)

హైదరాబాదు (అబిడ్ సర్కిల్) స్టేషన్‌రోడ్డులో

త్వరలో మా దుకాణము తెరువబడును.

ఉత్తమ గ్రంథములకు బహుమతులు

తెలుగు భాషా సమితి విన్నపము

ప్రాంతీయ భాషలలో ప్రజా సామాన్యమునకు సులభముగా బోధపడునట్టి తత్వశాస్త్ర సాహిత్యములకు, శాస్త్రములకు సంబంధించిన గ్రంథ రచనను ప్రోత్సహించే ఉద్దేశంతో మద్రాసు ప్రభుత్వంవారు బహుమతి విధానము నొకటి ఏర్పాటు చేసిరి (జి ఓ నెం 2723, విద్యాశాఖ, తేది 19-12-47) ఆ విధానముప్రకారం తత్వశాస్త్ర సాహిత్య, శాస్త్రవిషయములను పండ్రెండు తెగలుగా విభాగించి, ప్రతిసంవత్సరం ఆ రేసి తెగలకు చెందిన విషయముల మీద గ్రంథములువ్రాయించి తెప్పించి ఒక్కొక్క తెగకు సంబంధించి వచ్చిన పుస్తకాలలో ఉత్తమమయినదని నిర్ణీతమయిన ఒక్కొక్క గ్రంథానికి 500 రూపాయల చొప్పున ఏటా ఆరు తెగలకు చెందిన ఆరు ఉత్తమ గ్రంథాలకు 3 వేల రూపాయల చొప్పున అయిదు ఏండ్ల పాటు యిచ్చుటకు ప్రభుత్వం వారు ఆర్డరు జారీచేసి, బహుమతిపోటీ పరీక్ష కీయవలసిన విషయాలను నిర్ణయించుట, గ్రంథములు వ్రాయించి తెప్పించి, ఉత్తమగ్రంథములను నిర్ణయింపజేయుట, బహుమతి ప్రదానమున కేర్పాటు జేయుట— ఈ కార్యములను 1948 నుండి తెలుగు భాషా సమితివారి కొప్పజెప్పిరి సమితివారి బాధ్యతను ఉత్సాహముతో స్వీకరించి బహుమతి పోటీ కవసరమయిన నియమావళి మొదలయినవి యేర్పాటు చేసిరి

తత్వకళా సాహిత్యములకు సంబంధించినవి మూడు శాస్త్రములకుసంబంధించినవి మూడు, చొప్పున ప్రతి ఏడు సమితివారు ఆ రేసి విషయములనిచ్చి గ్రంథముల వ్రాయించి తెప్పించుచున్నారు అయితే ప్రభుత్వం వారి వర్గీకరణమును వరుసగా యథాతథముగా అనుసరించకపోయినా సమితి వారు రెండేళ్ళ కొకసారి వారిచ్చిన విషయములన్నీ వచ్చేటట్టు చూస్తున్నారు బహుమతి పోటీ పరీక్ష విషయాలు, ముఖ్య నియమావళికల కరపత్రాలను వివిధ కళాశాలలకు సంస్థలకుపంపుతున్నారు పోటీదారులు పుస్తకాలు పంపడానికి సాధారణంగా 10,12 నెలలు గడువిస్తున్నారు, రచయితలు కోరినప్పుడు గడువు పెంచుతున్నారు గ్రంథాలు వచ్చిన తరువాత సమితి కార్య నిర్వాహక సభవారు ఉత్తమ గ్రంథాలను నిర్ణయించి సిఫార్సు చేయుటకు సమర్థులూ, ఆయా విషయాలలో పండితులూ అయినవారిని నియమిస్తున్నారు, వారి సిఫార్సులను, అభిప్రాయాలను గమనించి ఫలితములను నిర్ణయించుటకు కార్య నిర్వాహక సభకు చెందిన ఉపసంఘ మొకటి యున్నది ఈ యుపసంఘము ఫలితములను ప్రభుత్వము వారికి నివేదిస్తున్నది ప్రభుత్వమువారు వాటి నామోదించిన తరువాత వాటిని స్థానిక పత్రికలలో ప్రచురించడ మగుచున్నది సమితి వారు ప్రత్యేకముగా బహుమతి ప్రదానోత్సవ మొకటి యేర్పాటు చేసి ప్రభుత్వమువారి బహుమతులను తత్వగ్రంథకర్తల కందజేస్తున్నారు

ఈ విధానము తెలుగు రచయితల కాదరపాత్రముగనే ఉన్నది కావ్య, నాటక, కథానికా, బాలసాహిత్యముల విషయములలో ఎక్కువమంది రచయితలు పాల్గొని గ్రంథములను పోటీకి పంపుచున్నారు, కాని శాస్త్ర విషయములకు, శాస్త్రస్వభావముగల విషయములకు, వివిధ గ్రంథ పరిచయ పఠనములు ఆలోచన, విషయ విబోధమునకు ఖర్చుచేసి వ్రాయించవలసిన బొమ్మలూ కావలసిన విషయములకు సంబంధించిన గ్రంథములు తృప్తికరముగా వచ్చుటలేదు

మొదట మద్రాసు ప్రభుత్వము వారేర్పాటుచేసిన విధానము అయిదేండ్లకుమాత్రమే మొదటి అయిదు సంవత్సరాలలోను పోటీకి ప్రకటించిన విషయములు సామాన్యవిద్యావంతులకుకూడా తెలిసేటట్లుండడంచేత పోటీలో చాలామంది పాల్గొనిరి (ఈ మైదేండ్లలోను కొన్ని విషయాలలో సమానమైన రెండుఉత్తమగ్రంథాలకు బహుమతిని పంచుటచేత 26 విషయాలకు సంబంధించిన 30 గ్రంథములకు బహుమతులివ్వబడినవి) ఇందువల్ల ప్రోత్సాహం కలిగి మద్రాసు ప్రభుత్వమువారివిధానమును మరి అయిదేండ్లపాటు జరుపుటకు ఆర్డరు జారీచేసిరి (జి ఓ నెం 83, విద్యాశాఖ తేది 19-1-58).

శాస్త్రగ్రంథాల కొరత కారణాలు

ఈ రెండవ పంచవర్ష కాలపరిమితిలో శాస్త్ర విషయాలకు సంబంధించిన గ్రంథాలెక్కువగా రాలేదు వచ్చిన వాటిలోనైనా వలసినంత మంచివీ ఆట్టేలేవు ఇట్లని శాస్త్ర గ్రంథ రచనలో తెలుగు దేశములో రచయితలకు కొరత ఉన్నదని చెప్పలేము మేలైన గ్రంథాలు ఇతరభాషా ప్రకటిత మవుతూనే ఉన్నవి ఇందుకు కారణము బహుమతి విధానము రచయితల నాకర్షించక పోవడమే అని తోస్తుంది. ఇదే కాకుండా ఈ క్రింది విధి కూడా కారణాలు కావచ్చును

శాస్త్ర గ్రంథ రచయితలకు గ్రంథ రచనలో కష్టమెక్కువ గ్రంథంసుబోధము, ఉపయుక్తము అగుటకు వలసిన రేఖాచిత్రములకు, ఇతర చిత్రములకు ధనము చాలా పెచ్చించాలి

ఇంతచేసినా బహుమతి వస్తుందని రచయితలకు ధైర్యము చాలదు నిజంగా పేరొందినవారికి, సామర్థ్యము గలవారికి పోటీలో పాల్గొని బహుమతి రాకపోతే చిన్నతనంగా ఉంటుంది

ఒకవేళ రచయితకు బహుమతి వచ్చినా గ్రంథ ప్రకటన కవసరమైన ఏవొక ఖర్చుకూ- కాగితమునకుగాని, అచ్చుకుకాని, బ్లాకులకుకాని, బైండింగుకు కాని- ఇచ్చిన బహుమాన ద్రవ్యం చాలదు

ఏదో ఒక విధంగా రచయిత గ్రంథాన్ని ప్రకటించినా పుస్తకాలమ్మడం ఖర్చుజేసిన డబ్బును రాబట్టుకోవడం- మళ్ళీ అదొక సమస్య బహుమాన గ్రంథమని బాగా అమ్ముడవుతుందనే ఆశా లేదు

ఈ యెనిమిదేండ్లలోను ఇంతవరకు సమితి 39 విషయాలమీద 45 పుస్తకాలకు బహుమతు లిచ్చినది వీటిలోనిది 30 వ్రాతప్రతులు, 15 అచ్చు ప్రతులు, 30 వ్రాతప్రతులలోను బహుమతి పొందిన తరువాత ప్రకటితమయినవి 5 గ్రంథాలు మాత్రమే ఈ గ్రంథాల అమ్మకము అంత ప్రోత్సాహకరంగా లేదు పెట్టిన పెట్టుబడి సొమ్మయినా గ్రంథకర్తలకు రాలేదు మిగిలిన గ్రంథాలలో 18 శాస్త్ర విషయాలకు సంబంధించినవి, 12 తత్వకళా సాహిత్యాలకు సంబంధించినవి

కాగితము మొదలయిన వాటి ధరలు పెరిగిపోవడం వల్ల ఒక్కొక్క శాస్త్ర గ్రంథం అచ్చు వేయించి ప్రకటించవలెనంటే దాదాపు రెండు మూడు వేలవుతుంది తత్వకళా సాహిత్యాలకుచెందినవైతే ఒక్కొక్క పుస్తకానికి రూ 1500 లకు పైన అవుతుంది బహుమతి పొందిన రచయిత తనంతట తాను తన గ్రంథాన్ని ప్రకటించుకో లేడు ప్రభుత్వము ఆ గ్రంథాన్ని ప్రకటించడు

ప్రభుత్వానికి భాషాసమితి విన్నపము

అందువల్ల బహుమతి విధానం ఏర్పాటు చేసిన ఆశయం బహుమతులు వచ్చిన గ్రంథాలన్నీ ప్రకటితమై పాఠక లోకమున కవి అందుబాటులోనికి వస్తేనే సఫలమవుతుంది కాబట్టి బహుమతి వచ్చిన గ్రంథాలు ప్రకటనయై పాఠకుల కందుబాటులోనికి వచ్చేటట్టు చూడడానికి ప్రభుత్వమువారు మార్గం ఆలోచించాలని మనవి

విశ్వకళా పరిషత్తులలో కూడా విద్యాబోధన రాష్ట్రభాషలో జరగాలనీ, ఆంధ్ర ప్రభుత్వ యంత్రమంతా తెలుగులోనే నడపాలనీ ఆలోచన జరుగుతున్న ఈ సమయంలో వివిధ విషయాల మీద పాఠకులకు సులభంగా బోధపడే పుస్తకాలు వ్రాయించి ప్రకటించి రచయితలకు ప్రోత్సాహమిచ్చే ఈ విధానం చాలా ముఖ్యమైనదీ, అవసరమైనదిని

కాబట్టి ప్రస్తుతావసరాలను తీర్చుటకు శాస్త్ర విషయాలకు, సాంఘిక శాస్త్రాలకు సంబంధించిన గ్రంథముల ప్రకటనను ప్రభుత్వము వారు ప్రోత్సహించుట యుక్తము ఇదిగాక ప్రభుత్వము వారా మోదించినట్టి, వారి ఆర్థిక సహాయం పొందే టటువంటి పుస్తక భాండాగారాలన్నీ చౌకబారు పుస్తకాలనే కాకుండా పై గ్రంథములను తప్పక కొనేటట్టు ప్రభుత్వము శ్రద్ధవహించడం అవసరం

పైని చెప్పిన విషయాల ననుసరించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమువారు

1 ఈ బహుమతి విధానమును మరొక ఐదేండ్లపాటు సాగించవలెననీ

2 బహుమతుల సంఖ్య 6 నుండి 10 వరకు హెచ్చింప వలెననీ

3 బహుమతి మొత్తమును రు 500 నుండి రు 1000 వరకు పెంచవలెననీ

4 బహుమతి పొందిన గ్రంథము ఒక్కొక్కటి వేయి ప్రతులు కొనవలెనని

5 పోటీకి వచ్చిన గ్రంథాలలో బహుమతి పొందుట కర్హము కాకపోయినప్పటికీ ఉత్తమ గ్రంథ నిర్ణేతలు ప్రకటన యోగ్యములని సిఫార్సు చేసిన వాటినికూడా ఒక్కొక్కదానికి వెయ్యేసి ప్రతులచొప్పున కొనవలెననీ

6 గడచిన సంవత్సరాలలో ప్రభుత్వ బహుమానార్థములై పైని చెప్పిన కారణాలవల్ల యింతవరకు ప్రకటన కాకుండా ఉన్నవాటి ప్రకటనకు ప్రభుత్వమువారే తగు వెల నిర్ణయించి వేయిప్రతులు కొని ప్రోత్సాహమియ్యవలెననీ విన్నవించుకొన బడుతున్నది

ఈ సూచనలను గూర్చి ప్రభుత్వము వారు సాదరముగా ఆలోచిస్తారనీ, అవిభక్త మద్రాసు రాష్ట్ర ప్రభుత్వము వారు కూడా మూడవతడవ సాగిస్తూవున్న ఈ బహుమతి నిధానాన్ని ఇదివరకుకంటే మంచి ఫలితాలు సాధించే దృష్టితో పైని సూచించిన మార్పులతో మరొక అయిదేండ్లపాటు సాగిస్తారనీ ఆశించబడుతున్నది ఈ పై సూచనలను 1957- 58 బహుమతి పోటీలకు కూడా వర్తింప జేయవలెనని మనవి

నేటినుండి నృత్యమిలు రంగులలో చూపబడును

అంజలీ పిక్చర్స్ వారి

సువర్ణసుందరి

(తెలుగు)

తా॥ అంజలి, నాగేశ్వరరావు, రేలంగి, రాజసులోచన,

24 వ వారము నడచుచున్నది.

రాజేశ్వర్

సికింద్రాబాదు

Trupix త్రిమియా రిలీజ్.



రాష్ట్రపతి ప్రయాణం

సికింద్రాబాదు స్టేషనువద్ద రాకపోకల ఏర్పాట్లు

హైద్రాబాద్, ఆగస్టు 4

భారత అధ్యక్షుడు 1957 ఆగస్టు 8 వ తేదీ గురువారంనాడు నగరం నుండి వెళ్లుతున్న సందర్భంలో సికింద్రాబాదు రైల్వే స్టేషనువద్ద రాకపోకలను క్రమబద్ధంచేసే ఏర్పాట్లను గురించి ఒక ప్రకటనచేస్తూ, ఈ క్రింది నిబంధనలు ఆనాడు ఉదయం 6-30 గంటలనుండి 8-30 గంటలవరకు సికింద్రాబాదు రైలు స్టేషను ప్రాంతంలో అమలు పరచబడగలవని హైదరాబాదు నగరం, సికింద్రాబాదు పోలీసు కమీషనర్ ప్రకటించారు

సికిందరాబాదు రైలు స్టేషను ఆవరణలోనుండి టాక్సీలు, ప్రైవేటు కార్లు, ఆర్ టి డి బస్సులు మొదలైన వాహనాలన్నీ తొలగింపబడు తవి రైలు స్టేషనుకు ఎదురుగా ప్రస్తుతం ప్రైవేటు బస్సులు ఆగుతున్న త్రికోణాకారపు కాంపౌండులో ఆర్ టి డి బస్సులు నిలుపబడుతవి

రైలు స్టేషనుకు వెళ్లగోరే అన్ని వాహనాలు, ప్యాసులులేని వ్యక్తులు "లోపలికి" అని పేర్కొనబడిన గేటులోనుండి వెళ్ళిరావాలి 3 వ తరగతి బుకింగ్ ఆఫీసువద్ద ఏర్పాటు చేయబడిన స్థలంలో వాహనములన్నీ ఉంచాలి

'బయటికి' అని పేర్కొనబడిన గేటుకు పశ్చిమ భాగంలోని స్థలం గుండా అధ్యక్షునికి వీడ్కోలు సందర్భంగా స్టేషనుకు వచ్చే ప్యాసులుగల అహూతులు రావలసి ఉంటుంది అట్టి వ్యక్తులు వాహనాలు 'బయటికి' గేటు నుండి స్టేషనుకు వచ్చి తిరిగి వెళ్లాలి

ఎస్ ఆర్ పి కార్యాలయం కెఇయం ఆసుపత్రుల మధ్యగల సందుగుండా వాహనాలు, వ్యక్తుల రాకపోకలు జరగకుండా ఆదారి మూసివేయబడుతుంది

జైపూర్‌లో విద్యార్థులపై పోలీసు లాఠీ ఛార్జి

జైపూర్, ఆగస్టు 3

సుమారు వెయ్యిమంది విద్యార్థులు ట్యూషన్ ఫీజును హెచ్చించినందుకు నిరసనగా ఊరేగింపు తీసినప్పుడు పోలీసులు లాఠీ ఛార్జిచేసి బాష్పవాయువును ప్రయోగించారు విద్యార్థుల ఊరేగింపుకు నాయకత్వం వహించిన వానినిఅరెస్టుచేశారు 144 వ సెక్షన్‌ను ధిక్కరించినందుకు యిద్దరు, విద్యార్థులు అరెస్టు చేయబడినారు మూడు రోజులుగా మూసివేయబడిన పాఠశాలలు తెరవబడినవి

ఇన్‌కమ్‌టాక్సు అధికారుల విధినిర్వహణ

నిక్కచ్చిగా వ్యవహరించాలని కేంద్ర ఆర్థికమంత్రి సలహా

నాగపూర్ ఆగస్టు 4

సమాచారం అవసరమైన వ్యక్తుల గూర్చి వివరాలతెలిపే యితరుల వాగ్మూలాలు తీసుకొనడానికి ఇన్‌కమ్‌టాక్స్ అధికారులకు అవకాశాన్ని యిచ్చేవిధంగా ఆదాయపు పన్నుచట్టపు 98వ సెక్షన్ సవరింపబడగలదని కేంద్ర ఆర్థికమంత్రి టి టి కృష్ణమాచారిగారు యిక్కడ తెలిపారు, ఇన్‌కమ్‌టాక్స్ అధికారులకు యీ విధంగా సంక్రమింపచేసే క్రొత్త అధికారాలు అలవాటుప్రకారం పన్నుల యెగవేసేవారిని యెదుర్కొనడంలో యెక్కువ తోడ్పడగలవని ఇన్‌కమ్‌టాక్సు అధికారుల శిక్షణ కళాశాలలో తమ కోర్సును పూర్తిచేసుకొని వెళ్ళుతున్న తొమ్మిది పదవ జట్టుల అభ్యర్థులనుద్దేశిస్తూ పేర్కొన్నారువీరు

ఇన్‌కమ్‌టాక్సు శాఖ యెదుర్కొంటున్న సమస్యల ప్రస్తావిస్తూ వీరు ఈ అధికారులు నిర్వహింపవలసిన బాధ్యతలు లాచాక్లిష్టమైనవని ఒక్కొక్కప్పుడు వీరు మోసపులెక్కలను, దొంగలెక్కలను, పన్నుల యెగవేతలను చూడవలసి రాగలదని అన్నారు కృష్ణమాచారిగారు ఇంకా యిలా పేర్కొన్నారు

"ఇతర కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కన్నా ఇన్‌కమ్‌టాక్సు అధికారుల విధినిర్వహణ గురుతరమైనది వీరు యితరుల మొహమాటాలకు లోనుకారాదు తమ విధుల నిర్వహణలో నిక్కచ్చిగా ఉండాలి అయితే మానవత్వాన్ని కోల్పోరాదు వీరి పని క్లిష్టమైనది, సుఖకరమైనదికూడా భారత ప్రభుత్వ పరిపాలనాధికారుల కూటమిని ఒకటి యేర్పాటు చేయుటకు నిర్ణయించుట ప్రశంసనీయమైనది ఇట్టి కూటమివల్ల వివిధ ప్రభుత్వశాఖలకు అవసరమైన ఉద్యోగులను ఒకరాష్ట్రంనుండి మరోరాష్ట్రానికి అవసరాన్ని బట్టి పంపుకొనవచ్చును ఒక అధికారి తను ఒక శాఖనుండి ఇంకొక శాఖకు మారదలచినా లేక ప్రభుత్వమే మార్చదలచినా తగు అవకాశాలు యిందువల్ల కల్పింపబడినవి మున దేశంలో ఇన్‌కమ్‌టాక్సు వ్యవస్థ విస్తృతం చేయబడుతున్నది త్వరలో మూడునుండి ఆరులక్షల ఆసెసర్లు క్రొత్తగా చేర్చబడగలరు"

నాగపూర్‌లో యీ శిక్షణ కళాశాల 1957 ఫిబ్రవరి 4 వ తేదీన ప్రారంభింపబడినది తొమ్మిదవజట్టులో 32 మంది పదవ జట్టులో 17 మంది ప్రొబేషనర్లు కలరు

భాగ్యనగర బాలసంఘం

హైద్రాబాద్, ఆగస్టు 4

చుడిబజారు భాగ్యనగర బాలసంఘం స్థాపించబడి ఐదుసంవత్సరాలు అయినది దీని కార్యనిర్వాహక సంఘ సభ్యులు గత శనివారం సమావేశమై దీనిపేరు "భాగ్యనగర బాలానంద" ముగా ఏకగ్రీవంగా మార్చుటకు నిర్ణయించినారు బాల సంఘం కార్య నిర్వాహక సభ్యులు తాత్కాలికంగా భాగ్యనగర బాలానందంలో పనిచేయనిశ్చయించిరి బాలానందం ఎన్నికలు సెప్టెంబర్ నెలలో జరుగగలవు

బాలానందం మొదటి వినోద కార్యక్రమం 15 ఆగస్టునుండి 17వరకు స్వాతంత్ర్య శతవార్షిక సందర్భంలో జరుగుతాయి వినోద కార్యక్రమములలో శ్రీ బి కిషన్‌లాల్ మేయర్ శ్రీ గోపాలరావుఎక్బోటే ఎం ఎల్ ఏ తదితరులు పాల్గొంటారు

సర్వేలు, వెలమకన్నెగ్రామాలలో మద్యనిషేధం

ఎత్తివేయవలసిందిగా ప్రభుత్వానికి మెమోరాండం

హైద్రాబాదు, ఆగస్టు 4

నల్లగొండ తాలూకా సర్వేలు వెలమకన్నె గ్రామాలకుచెందిన దాదాపు అరవైమంది కల్లుగీత పారిశ్రామికులు ముఖ్యమంత్రి నీలంసంజీవ రెడ్డికి యితర మంత్రులకు డిప్యూటీ స్పీకర్ కొండాలక్ష్మణ్‌కు సమర్పించిన ఒక మెమొరాండంలో యీ రెండు గ్రామాలలో మద్యనిషేధం అమలు జరుపక దానిని యెత్తివేయ వలసినదిగా కోరారు యేవైనా కారణాలవల్ల దాటి బెల్లం తయారీ అవసరమైనపక్షంలో అందుకుగాను కొన్ని చెట్లు ప్రత్యేకింపవచ్చని, దాటిబెల్లం తయారీ యెక్కువ లాభసాటి వ్యాపారంకాదు కావున యిది అందరు గీత పారిశ్రామికులకు ఉద్యోగాన్ని చూపించలేక పోవచ్చని తమ మెమొరాండంలో పేర్కొన్నారు

గీత పారిశ్రామికుల ప్రతినిధి ఒకరు మెమొరాండంలోని అంశాలలో జిల్లా కాంగ్రెసు నాయకులు ఆ ప్రాంత శాసనసభ్యులు ఏకీభవించారని కొన్ని చెట్లను దాటిబెల్లం తయారీకి మిగతా వాటిని కల్లుగీతకు అనుమతించడంలో తప్పేమీలేదని అభిప్రాయ పడినారు మెమొరాండంలోని అంశాలను ప్రభుత్వము పరిశీలింపగలదు

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల వార్షికసభ

ఆగస్టు 17, 18 తేదీలలో

హైద్రాబాద్, ఆగస్టు 4

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ వార్షిక సభలు హైద్రాబాద్ నగరంలో ఈ నెల 17,18 తేదీలలో జరుగుతాయి లక్నో నుండి వెలువడు నేషనల్ హెరాల్డు పత్రికా సంపాదకులు ఎమ్ చలపతిరావు వీనికి అధ్యక్షత వహింపగలరు

ముఖ్యమంత్రి ఎన్ సంజీవరెడ్డి గారు ఈ సభలను ప్రారంభించగలరు, రెండురోజులపాటు జరిగే ఈ సభల సందర్భంలో వార్తాపత్రికల ప్రదర్శనం ఒకటి ఏర్పాటు చేయబడుచున్నది సాంస్కృతికకార్యక్రమాలను సాంఘిక సంక్షేమ కార్మికమంత్రి డి సంజీవయ్య ప్రారంభిస్తారు, దెలిగేటు రుసుము రు 2-8-0.

అంతర్జాతీయ చేతి వస్తువుల ప్రదర్శన

సెప్టెంబర్ 19 నుండి 28 వరకు

లండన్, ఆగస్టు 4

సెప్టెంబరు 19 నుంచి 28 వరకు లండన్‌లో ఎరల్స్ కోర్టువద్ద జరుగనున్న పంచమ అంతర్జాతీయ చేతి వస్తువుల ప్రదర్శనలో, అధునాతన పనితనం పద్ధతులుగల అనేక రకాల వస్తువులు ప్రదర్శించ బడనున్నాయి ఈ సంవత్సరం జరుగుతున్న ప్రదర్శన ఇదివరకు జరిగిన వాటన్నిటికంటే అన్ని విధాలా పెద్దదిగా ఉంటుంది ప్రదర్శన యొక్క అంతర్జాతీయ విభాగంలో, ప్రపంచంలోని వివిధ ప్రాంతాల నుంచి చేతి వస్తువులను తయారు చేసేవారు, తమతమ దేశాల దుకాణాలలో ఆ వస్తువులను తయారు చేయటాన్ని కూడా ప్రదర్శించుతారు

అమీర్‌పేటలో దొంగసారా కేంద్రాలు

పోలీసులదాడి, ఏడుగురి అరెస్టు

హైద్రాబాదు, ఆగస్టు 3

అమీర్‌పేటలో ఇప్పటివరకు దొంగసారా ఉత్పత్తిని, అమ్మకాన్ని యథేచ్ఛగా సాగిస్తున్న వారికి సైఫాబాద్ డివిజనల్ పోలీసువారు జరిపినదాడి వెన్నుపోటుగా పరిణమించినది

అసిస్టెంట్ పోలీస్ కమీషనర్ ఆర్ వి సుబ్బారావు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ అలీఖాన్ తదితర అధికారులు పోలీసు జట్టును తీసుకొని అమీర్‌పేటలో అనుమానాస్పదంగా తోచిన ప్రాంతాలచుట్టు ముట్టారు దాదాపు ఇరువది ఇండ్లను వీరు సోదాచేశారు తొమ్మిది ఇండ్లలో సారా తయారుచేసే యంత్రపరికరాలు పట్టుబడినవి రాగిపాత్రలు 8 భట్టీలు 30 గ్యాలన్లసారా పట్టుబడినది 3 వేల గ్యాలన్ల బెల్లపు మురుగు సారాచేయడానికి పనికివచ్చేది పట్టుకొనబడి ధ్వంసం చేయబడినది సారా తయారికి చిన్న సిమెంట్ టాంకులుగూడా ఉపయోగింపబడు చున్నాయట ఇట్టి రెండు సిమెంట్ టాంకులు ధ్వంసం చేయబడినవి

ఈ సందర్భంలో పోలీసులు గురుబక్షిసింగ్, లాల్‌సింగ్ అను వారిని మరో ఐదుగురిని అరెస్టుచేశారు ఇందు ఇద్దరు స్త్రీలుకలరు ఇంకాదర్యాప్తులు సాగుతున్నాయి

నర్సారావుపేటలో బెంచి కోర్టు

హైద్రాబాదు, ఆగస్టు 4

శ్రీయన్ ఆంజనేయశాస్త్రిగారికి మొదటి తరగతి మేజిస్ట్రేట్ల అధికారాలన్నీ యివ్వబడినవి ఆయన నర్సారావుపేట బెంచి కోర్టు సభ్యుడుగా నియమించబడినారు

శ్రీయుతులు దెర్రి ఆనందరావు, సంద్యాల కోటిరెడ్డి, కురవది చెన్నయ్య, చిలకలపూడి అప్పారావు, పబ్బతి వెంకటేశ్వర్లు, షేక్ అబ్దుల్ ఖాదర్, ఇర్రి వెంకటార్రిగార్లు, శ్రీమతి మన్నేపల్లి సావిత్రమ్మగార్లకు 3 వ తరగతి మెజిస్ట్రేటు అధికారాలు ఇచ్చి, సదరు బెంచి కోర్టు సభ్యులుగా నియమించడమైనది

ఈ నియామకాలు ది 1-8-1957 నుండి రెండు సంవత్సరాల వరకు అమల్లో వుండగలవు

దేవరకొండ తాలూకాలో కరువు పరిస్థితి

ప్రభుత్వ సహాయానికి అభ్యర్థన

దేవరకొండ, ఆగస్టు 4

నల్లగొండజిల్లాలోని దేవరకొండ తాలూకాలో, గత సంవత్సరం సరిగా వర్షాలు లేక పంటలు పండని కారణముచే కరువు వ్యాపించిందని ప్రజలకు తిండిలేక, పశువులకు మేతలేక రైతులు చాల ఇబ్బందులకు గురియగుచున్నారని జి నారాయణరెడ్డి ఎం ఎల్ ఏ ఒక ప్రకటనలో తెలుపుచున్నారు, ఇంకా వారు తమ ప్రకటనలో పేదవాని కొనుగోలుశక్తి తగ్గిందని ఈ సంవత్సరం చెరువు బాటుగా పడిన వర్షాలకు వేసిన చేనులు ఎండిబొంతపురుగుబట్టినదని బావులలో నీరు అడుగుకు చేరినదని చెరువులలోకి మొదటవచ్చిన నీటితో తడిపిన వరిపొలాలు నీరులేక ఎండిపోటు వారినవని తెల్పుచున్నారు

కరువులో అధిక మాసమన్నట్లు, ఈ సమయములో ఇన్‌ఫ్లుయెంజాజ్వరాలు వచ్చి పడిపోవుచున్నారు రెండు రోజులక్రితం కొద్దిగా వర్షముపడినంత చేలకు ఆధారం లభించింది కాబట్టిఇట్టి విపత్కర పరిస్థితులలో ప్రభుత్వం తాలూకాలోని ప్రతి రెవిన్యూ సర్కిలుకు రెండు చౌక ధాన్యం డిపోలు తెరచి ప్రజల ఆదుకోవాలని వీరుకోరుచున్నారు

ఇండోబ్రిటిష్ వ్యాపారం

పెరుగుదల ధోరణి

లండన్, ఆగస్టు 4

లండన్‌లో వాణిజ్య శాఖ ప్రకటించిన అంకెల ప్రకారం ఇండియాతోటి బ్రిటన్ వ్యాపారం, గత సంవత్సరం మొదటి ఆరు మాసాలలోకంటే ఈ సంవత్సరం మొదటి ఆరు మాసాలలో బాగా పెరిగినట్లు కనిపిస్తున్నది ఇండియా తెప్పించుకొన్న బ్రిటిష్ వస్తువుల విలువ 85 804,980 పౌండ్ల నుంచి 94,462,788 పౌండ్లకు పెరిగింది బ్రిటన్ తెప్పించుకొన్న ఇండియా వస్తువుల విలువకూడ 74,096,298 పౌండ్లనుంచి 88,167561 పౌండ్లకు పెరిగింది

బ్రిటన్ తేయాకు కొనుగోళ్ళు కూడ గత సంవత్సరంకంటే బాగా పెరిగినాయి ఈ సంవత్సరం జూన్ నెల అంతంవరకు బ్రిటన్ 47,615,907 పౌండ్ల విలువగల తేయాకును తెప్పించుకొన్నది గత సంవత్సరం మొదటి ఆరు మాసాలకు సంబంధించి ఈ అంకె 32,040 234 ఉన్నది ఈ సంవత్సరం మొదటి సగంలో నేత ఉత్పత్తులను కూడ బ్రిటన్ అధికంగా కొనుగోలు చేసింది ఈ దిగుమతుల విలువ 6 263,192 పౌండ్లనుంచి ఈ సంవత్సరం 7,066,789 పౌండ్లకు పెరిగింది ప్రత్తి నూళ్ళ నేత వస్త్రాల కొనుగోలు కూడ 4,133,147 పౌండ్లనుంచి 5,581,844 పౌండ్లకు పెరిగింది అయితే వనస్పతి నూనెలో ఇండియా అమ్మకాలు 4,889,330 పౌండ్లనుంచి 2,335,239 పౌండ్లకు పడిపోయినాయి కాని ఇండియానుంచి బ్రిటన్ తెప్పించుకొనే తోళ్ళు, తోళ్ల వస్తువుల విలువ క్రిందటి సంవత్సరంకంటే పెరిగింది

ఆలిండియా రేడియోలో వ్యయకర్తనం

పొదుపుకై పలుసూచనలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ఆలిండియా రేడియో నిర్వహణ మరియు కార్యక్రమాల ప్లానింగ్‌లో పొదుపుకై పలుచర్యలు తీసుకొనడానికి నిర్ణయింపబడినది ఇటీవల ఇక్కడ ఆలిండియా రేడియోవ్యయంలో పొదుపుకయి ఆలోచించుటకు ఈ శాఖ అధికారుల సమావేశం జరిగినది

ఇందు చేయబడిన సూచనలలో ముఖ్యమైనవి, ప్రతి స్టేషన్ ప్రోగ్రాము కాలంలో అరగంటను తగ్గించుట ట్రాన్స్‌మిటర్లు టెస్టింగ్ సైమును తగ్గించుట, రికార్డుచేయబడిన సంగీతాన్ని ఎక్కువగా ఉపయోగించుట, జాతీయ కార్యక్రమాలు సహితంఏవో కొన్ని సందర్భాలలో ఢిల్లీకి సంగీత విద్వాంసులు పిలిపింపబడినానే తప్ప ముందుగారికార్డుచేసిఉపయోగించుట

ఇంకా సంగీత సమ్మేళనాలు సాంస్కృతిక వారోత్సవ కార్యక్రమాలతగ్గించుట ప్రస్తుతంఉన్న రేడియో ఉద్యోగాల ఖాళీల భర్తీచేయడంలోనే కాక క్రొత్తఉద్యోగాల ఏర్పరచడంలో గూడా పొదుపు చర్యలు అవలంబించబడుతవి

హిందీ ప్రచార చరిత్ర

ప్రచారకులకు విజ్ఞప్తి

విజయవాడ, ఆగస్టు 4

ఆంధ్రరాష్ట్ర హిందీ ప్రచార సంఘ కార్యదర్శి ఉన్నవరాజ గోపాల కృష్ణయ్యగారిట్లు తెలుపుచున్నారు

ది- 29-7-1957న హైదరాబాదులో రాష్ట్రపతి డాక్టరు శ్రీ రాజేంద్ర ప్రసాదుగారి అధ్యక్షతను సుప్రసిద్ధ హిందీ ప్రచారకులగు శ్రీ మోటూరి సత్యనారాయణ గారికి సన్మాన సభ జరిగినప్పుడు ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘ పక్షమున ప్రచురించిన "హిందీ ప్రచార చరిత్ర" సన్మాన సంచికగా శ్రీ రాష్ట్రపతిచే, శ్రీ సత్యనారాయణ గారికి బహూకరింప బడినది ఈ గ్రంథములో ప్రస్తుతము మూడు భాగములున్నవి మొదటి భాగములో శ్రీ బాలచంద్ర ఆప్టే, శ్రీ ఉన్నవ రాజగోపాల కృష్ణయ్య, శ్రీ అవధనందన్, శ్రీ దేవదూత విద్యార్థి, శ్రీ ఎన్ ఆర్ శాస్త్రి, శ్రీ వేమూరి రాధాకృష్ణమూర్తి, శ్రీ వారణాసి రామమూర్తి, శ్రీ ఆరిగపూడి రమేశ చౌదరి గారలు దక్షిణ భారత హిందీ ప్రచార చరిత్ర, ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార చరిత్ర, ఆయా ప్రచారకుల అనుభవ విశేషములు, విద్యాలయములలో హిందీ ప్రవేశము ఆంధ్ర, హిందీ సాహిత్యముల పరస్పర సంబంధము మున్నగు విషయములు మనోజ్ఞముగా చిత్రింప బడినవి.

రెండవ భాగములో శ్రీ మోటూరి సత్యనారాయణ్ణగారు అప్పుడప్పుడు వివిధ విషయములపై వ్రాసిన వ్యాసములు గలవు ప్రజాతంత్ర భారత దేశములో భాషా రాష్ట్రములు, సాహిత్య సమన్వయము, హిందుస్తానీ, హిందీకి గల చతుర్ముఖ రూపము, సామాన్య భాష, సామాన్య లిపి, భారతీయ భాషా పీఠము, ఆంధ్ర రాజ్యములోని జలశక్తి ఈ మొదలగు వ్యాసములు శ్రీ సత్యనారాయణ గారి బహు విషయ విజ్ఞతను వెల్లడించుచున్నవి ఇక మూడవభాగములో ఎనిమిది వందల మంది హిందీ ప్రచారకుల పరిచయములుపొందుపరచబడినవి

ఆంధ్ర దేశములోని కళాశాలల్లోను అయితేనేమి ఇతర రూపముగా నయితేనేమి సుమారు రెండువేల మంది హిందీ ప్రచారకులు పనిచేయుచున్నారు ఈ హిందీ ప్రచారక చరిత్రలో ప్రకటించుటకు తమ పరిచయ వివరములు పంపవలసినదని మేము ప్రచారక సోదరులకు విజ్ఞప్తి చేయగా సుమారు ఎనిమిది వందల మంది ప్రచారకులు మాత్రమే తమ పరిచయములు పంపియున్నారు వీరిలో చాలమం

ఆంధ్రప్రదేశ్ సాహిత్య పరిషత్తు నిర్మాణం

శ్రీ గోపాలరెడ్డి అధ్యక్షతలో 15 మంది సభ్యులతో కార్యవర్గం, 60 మంది సభ్యులతో జనరల్ కౌన్సిల్

హైద్రాబాద్, ఆగస్టు 3

ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ మరియు ఎగ్జిక్యూటివ్ బోర్డు (కార్యవర్గం)లకు ప్రభుత్వం క్రిందివారిని నామినేట్ చేసింది

ఎగ్జిక్యూటివ్ బోర్డు సభ్యులు

ఆర్థికమంత్రి డా॥ బెజవాడ గోపాలరెడ్డి (అధ్యక్షుడు), శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ (ఉపాధ్యక్షుడు) దేవులపల్లి రామానుజరావు (కార్యదర్శి) చదలవాడ పిచ్చయ్య సంయుక్త కార్యదర్శి), ఎం ఏ అబ్బాసి (కోశాధిపతి), విద్యాశాఖ కార్యదర్శి ఎస్ ఏ అయ్యంగార్, మల్లంపల్లి సోమశేఖరశర్మ, దేవులపల్లి కృష్ణశాస్త్రి, నార్ల వెంకటేశ్వరరావు నాయని సుబ్బారావు, అబ్బూరి రామకృష్ణారావు, డా॥ బి కృష్ణమూర్తి (ఆంధ్ర విశ్వవిద్యాలయ తెలుగు లెక్చరర్), డా॥ దివాకర్ల వేంకటావధాని సి నారాయణరెడ్డి, ఫజ్లుల్ రహమాన్

జనరల్ కౌన్సిల్ సభ్యులు.

శ్రీయుతులు బెజవాడగోపాలరెడ్డి (అధ్యక్షుడు), విశ్వనాథ సత్యనారాయణ (ఉపాధ్యక్షుడు), ఎస్ ఏ అయ్యంగార్, ఎం ఏ అబ్బాసి, శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి, మాడపాటి హనుమంతరావు, కాళీకృష్ణమాచార్యులు, వేంపల్ల సూర్యనారాయణశాస్త్రి, ఒ లుసు వెంకటేశ్వర్లు, వేదుల సత్యనారాయణశాస్త్రి, జమ్ములమడక మాధవరావుశర్మ, శివశంకరస్వామి, ఫజ్లుల్ రహమాన్, వంశీధర విద్యాలంకార్, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, బోయి భీమన్న, శ్రీమతులు పొనకా కనకమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, శ్రీ కె రామకోటీశ్వరరావు, అజంతా, మునిమాణిక్యం నరసింహారావు, కప్పగంతుల నిత్యనారాయణ, మరోయిద్దరు సభ్యుల్ని తరువాత ఏర్పడనున్న లలిత కళా పరిషత్తునుండి తీసుకోవడం జరుగుతుంది

అరవ తేదీ ఉదయం ట్రాఫిక్ ఏర్పాట్లు

హైద్రాబాద్, ఆగస్టు 4

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ 6వ తేదీ ఉదయం ఖుర్షీద్ జాహిబారాదరిలో పోలిటెక్నిక్ ఇన్ స్టిట్యూట్ ప్రారంభోత్సవం జరిపే సందర్భంగా పోలీసు కమీషనర్ యీ దిగువ ట్రాఫిక్ ఏర్పాట్లను ప్రకటిస్తున్నారు. ఇవి ఆరోజు ఉదయం 9 నుండి 11-30 వరకు అమల్లో ఉంటాయి

ఫతేదర్వాజానుండి చౌక్‌కు పోయే శకటాలు ఫకీర్ దేవిడీ అంక్షా మీదుగా దూద్ కావులీ దర్వాజాకు, పాతవంతెననుండి చౌక్‌కుపోయే శకటాలు మూసాబావులీమీదుగా మహబూబ్‌కీ మెహందీ రోడ్‌కు, పాలిబండా నుండి చార్మినార్‌కు పోయేవి కమాన్ షా జాదా బేగం ఇంక్షా మీదుగా మొగల్‌పూరా (ఖాజాకాఖల్లా) కు ప్రయాణం చేయాలి

సాధువువద్ద దొంగసారాయి పట్టుబడి

హైద్రాబాద్, ఆగస్టు 4

సాధు వేషంలోఉండి దొంగ సారాయిని తీసుకొని వెళ్ళుతున్న ఒక వ్యక్తిని చార్‌మినార్ పోలీసు అరెస్టు చేశారు ముస్లిమ్‌జంగ్ బ్రిడ్జివద్ద అనుమానాస్పదమైన స్థితిలో యీతను తిరుగుచుండగా పోలీసులు పట్టుకొని సోదా చేయగా ఒక మోటార్ ట్యూబ్‌లో గుడంబా వెళ్ళినది

వెనుకబడిన జాతుల సంక్షేమం

భారత ప్రజానీకంలో ప్రత్యేక రక్షణ, సౌకర్యాలు అవసరమయిన కొన్ని వర్గాలున్నాయనీ, ఆ వర్గాల అభ్యుదయం, సంక్షేమాల సాధన ప్రభుత్వం యొక్క బాధ్యత అనీ భారత రాజ్యాంగ నిర్మాతలు గుర్తించారు ఇందునిమిత్తం పరిగణించబడిన ప్రధాన వర్గాలలో ఈ క్రిందివి ఉన్నాయి షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డుతెగలు మాజీ నేరస్తజాతులు, తదితర వెనుకబడిన తరగతులు ఈ పై తరగతులకు చెందినవారి యీనాటి మొత్తం సంఖ్య ఎనిమిది కోట్లకు పైగా ఉంది అంటే దేశం మొత్తం జనాభాలో అయిదవ వంతు

ఈ ప్రజల సముద్ధరణ, సంక్షేమానికి రాజ్యాంగంలోని ఆదేశ సూత్రావళిని అమలుజరపడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక చర్యలు తీసుకున్నాయి మహాత్మా గాంధికి అతిప్రియమైన అంటరానితనం నిర్మూలనకు వెనుకబడిన తరగతుల ఆర్థిక, విద్యాభ్యున్నతికి, పార్లమెంటులోను, శాసన సభల లోను, ఉద్యోగ శాఖల లోను ప్రత్యేక ప్రాతినిధ్య కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోబడినాయి ఈ పథకాల నిర్వహణకు తొలి పంచవర్ష ప్రణాళికలో 42.46 కోట్ల రూపాయలు కేటాయించబడినాయి కొండజాతి ప్రాంతాలలోను, వెనుకబడిన ప్రాంతాలలోను రోడ్ల సౌకర్యాలు కల్పించడానికి విద్యా సౌకర్యాలను పెంపొందించడానికి, పరిశుభ్రమయిన గృహాలను నిర్మించడానికి యిప్పటివరకూ జరిగిన కృషి ప్రశంసనీయమైనట్టిది

కొండజాతుల కళా విశేషాలను, వివిధ ప్రాంతాలలోని సంస్కృతిని, ఆచార—వ్యవహారాలను పరిశీలించడానికి అనేక రాష్ట్రాలలో ప్రత్యేక సంస్థలు నెలకొల్పబడినాయి ఆ ప్రాంతాలలోని జానపద కళా శాస్త్రాన్ని సంస్కృతిని సక్రమ పద్ధతులలో పెంపొందించడానికి ప్రత్యేక కృషి జరుగుతున్నది

+ + +

1 వ చిత్రం - ఒరిస్సా రాష్ట్రంలోని కోరాపుట్‌లో జరిగిన ఒక కొండజాతి ఉత్సవములో పాల్గొన్న ఒక పార్టా యువకుడు

2 వ చిత్రం - కొండజాతి ప్రాంతంలోని కొందరు స్త్రీ వలంటీర్లు భూసార రక్షణ కార్యక్రమ సందర్శనములో శ్రమ దానం చేస్తున్నారు

3 వ చిత్రం - కొత్తగా నెలకొల్పబడిన ఒక గ్రామ పాఠశాలలోని ఒక గోదార (గ్రోడారు) విద్యార్థిని

4 వ చిత్రం - అజ్మీర్‌లోని మాజీ నేరస్తజాతుల వసతి వాడలో ఒక మహిళ తన కుమార్తెకు నూలు వడకు విధానాన్ని నేర్పుతున్నది ఒక కొండజాతి మహిళ స్త్రీ సంక్షేమార్థం జరుగుతున్న కృషిని కళ్లారా చూస్తూ ఆనందిస్తున్న దృశ్యం

గోలకొండ గ్రంథాలయం

ఆంధ్రవాణి

సంవత్సర చందా ఆరు రూపాయలు కోయిలకుంట్ల కర్నూలుజిల్లా

ఇంతవరకు వయోజన మాస పత్రికగా వెలువడిన ఇది ఇప్పుడు ప్రణాళికా ప్రచార పత్రికగా రూపొందినది దేశ సౌభాగ్యానికి ప్రణాళికల ద్వారా సాగింపబడుతున్న కృషిని ప్రజలు అవగాహన చేసుకొని వాటి విజయానికి సంపూర్ణ సహాయ సహకారముల ఇవ్వవలసిన అవసరంకలదు ప్రణాళికల వైపు ప్రజల దృష్టిని మరల్చడంలో ప్రభుత్వం చేస్తున్నకృషికి ఈ పత్రిక దోహదం కల్పించగలదని ఆశింపవచ్చును

క్షేత్రగణితోద్యానము

వెల రు 2-25 గ్రంథకర్త,- దేవరాజు వామనమూర్తి అధ్యాపకుడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల లక్షటిపేట ఆదిలాబాద్ జిల్లా గణిత శాస్త్రంలో క్షేత్రగణితానికి ఒక ప్రత్యేకత గలదు తెలుగులో క్షేత్రగణితాన్నిగూర్చి వెలువడిన పుస్తకాలు బహుఅరుదు సాంకేతిక విద్యకు అధిక ప్రాధాన్యము లభించుచున్న ఈ రోజుల్లో విద్యార్థుల ఆసక్తిని క్షేత్రగణితంపై అధికం చేసేందుకు ఇట్టి పుస్తకాలు ఉపకరింపగలవు గ్రంథకర్త దీనిని తెలంగాణా ప్రాంతపు హైచ్ ఎస్ సి పరీక్షకుపయోగపడు రీతిగా పాఠ్య ప్రణాళికననుసరించి 8, 9, 10వ తరగతులకై రచించారు

ఈ పుస్తకమున తొలి భాగమున సమతల క్షేత్రముల వైశాల్యము రెండవ భాగమున ఘనములు వాని ఘన పరిణామములగూర్చి చర్చింపబడినది ప్రతి భాగము వివిధ అధ్యాయములుగ క్రమబద్ధంగా విభాగింపబడితగు అభ్యాసములు ఇవ్వబడినవి ఇంకొక విశేషమేమనగా హైచ్ ఎస్ సి పరీక్షా పత్రములలోని ప్రశ్నలు ఇందు చేర్చబడినవి ఇది విద్యార్థులకు ఉపాధ్యాయులకు అత్యంత ఉపయుక్తముగా ఉండగలదని విశ్వసింపవచ్చును

యోగసాధన

శ్రీ స్వామి శివానంద రచనకు దిగవల్లి శేషగిరిరావుగారి ఆంధ్రీకరణ వాదమిది ప్రచురణ ఆధ్యాత్మిక గ్రంథమండలి బకింగ్‌హామ్‌పేట విజయవాడ-2 వెల సాదా ప్రతి రు 5-0-0

ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకొని యోగ సాధనకు ఉపకరించువారికి ఈ గ్రంథము అత్యంత ఉపయోగకారి కాగలదు ఇందు ధారణ అనగా ఏమి? ధ్యానమునకు కావలసిన అవశ్యకతలు అనుసరింపవలసిన విధినియమాలు ధ్యానపు వివిధ విధానములు లభించబోవు అనుభములు తొమ్మిది అధ్యాయములలో విపులముగా చర్చింపబడినవి

శ్రీ తిరుమలదేవ శతకము

రచన — తోటపల్లి కృష్ణమూర్తి వెల 0-8-0 పద్యరచనలో శతకములకు ప్రత్యేకస్థానము కలదు నీతిబోధకము భక్తిప్రభావ జనితమునగు ఈశతకము ఈ రచయిత తొలిప్రయత్నము కందములో నియమబద్ధముగ ఏకమకుటముతో రచన సాగించుటతోనే కాక మృదు మధురపదముల సంగ్రహణలోను భావసృష్టి అద్భుతాభీర్యమును పోషించుటలోను వీరికృషి ప్రోత్సహనీయము వలయువారు రచయితపేర జడ్‌చర్ల మహబూబ్‌నగర్ జిల్లా అని వ్రాయవలెను

యాత్రా మార్గదర్శి

వెల రు. 4-0-0 ఇందు దక్షిణ భారతపు మైసూరు, కేరళ, మలబార్, కూర్గు ప్రాంతములలోని యాత్రాస్థల విశేషములు పేర్కొనబడినవి ప్రకాశకులు శ్రీ సీతారామనామ సంకీర్తన సంఘము, శ్రీరామ నామక్షేత్రము గుంటూరు గ్రంథకర్త శ్రీరాగం వెంకటేశ్వర్లుగారు

భారతదేశమునందు పుణ్యక్షేత్రములు అపారములుగా కలవు. ఆయా క్షేత్రముల దర్శించి వానిమహిమలను గని తరించువారే ధన్యజీవులు యాత్రలవల్ల కల్గు ప్రయోజనములు ఐహిక ఆముష్మిక ఫలముల దృష్ట్యా ఈ గ్రంథము విలువను గ్రహింపనగును ఇది తీర్థయాత్రలకు వెళ్ళువారికి ఎక్కువ ఉపయోగకరము

నవ్వు చైనా

రాజా హతీసింగ్‌కు ఎన్ ఆర్, చంధూర్ అనువాదం ప్రచురణ ప్రతిమా బుక్స్ 49 ముకుతాల్ వీధి మద్రాస్-7 వెల రు 2

1951లో ఇండియా చైనా సుహృద్భావ సమితి తరపున భారత ప్రఖ్యాత జర్నలిస్టులలో ఒకరగు రాజా హతీసింగ్ చైనా పర్యటనకు వెళ్ళారు వారి ఆరు వారాల పర్యటనలో ఆదేశంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత జీవనప్రమాణంలోఎట్టిమార్పులు వచ్చినవి? వివిధ ప్రాజెక్టులు, విద్య, వైద్యం, గృహవసతి, సాంఘిక విషయాలలో సాధించిన ప్రగతిని గూర్చి రచయిత తమ అభిప్రాయాలను ఈ గ్రంథంలో వెలువరించారు నవభారత నిర్మాణంలో వివిధ సమస్యల పరిష్కరించుకొంటూ మనం పురోగమిస్తున్నాం పొరుగుదేశమైన చైనాలో సాధింపబడుతున్నదని గొప్పగా చెప్పుకొనే అభివృద్ధిలోని బండారమెంతో దాని వాస్తవిక విలువ ఏమిటో మన దేశ పరిస్థితులతో పోల్చుకొని చూచుకొనుటకు అక్కడి యథార్థ పరిస్థితుల కొంతగానైనా గ్రహించుటకు ఈ గ్రంథం తోడ్పడగలదు.

రాధాబాయి పల్నీత్‌కర్ వైద్యపాఠశాల

విద్యార్థుల ఆందోళన

హైద్రాబాద్, ఆగస్టు 4

ప్రభుత్వంచే గుర్తించబడని రాధాబాయి పల్నీత్కర్ మెడికల్‌స్కూలు విద్యార్థులు దాదాపు 800 మంది తమ భవిష్యత్తునుగూర్చి ఆందోళన చెందుచున్నారు

ప్రభుత్వం వైద్యపాఠశాలను గుర్తింపదలవకున్నా దీని విద్యార్థులకు భవిష్యత్తు విషయమై ఏదో రూపముగా తోడ్పడ దలుస్తుండుట కీడులో మేలుగా ఉన్నదని విద్యార్థుల చర్యా కమిటీ సభ్యుడొకరు వ్యాఖ్యానించారు

కమ్యూనిటీ ప్రాజెక్టులపై సెమినార్

హైద్రాబాద్, ఆగస్టు 4

ఆగస్టు 5, 6 తేదీలలో విశాఖపట్నంలో హైద్రాబాద్ జిల్లాలోని కమ్యూనిటీ డెవలప్‌మెంటు ప్రాజెక్టుల సెమినార్ జరుగుతుంది 5 వ తేదీ ఉదయం 9 గంటలకు ప్లానింగ్ డెవలప్‌మెంటు మంత్రి వి బి రాజు ఈ విద్వద్‌గోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తారు ఇంకా దాదాపు 500 అధికారులు సభ్యులు పాల్గొనగలరు

రేడియో

హైద్రాబాద్

411 0 మీటర్లు (730 కిలోసై)

6 ఆగస్టు మంగళవారం

ఉ॥ 6-50 సుప్రభాత్ (క), కార్యక్రమ వివరణ 7-00 తె-వా, 7-15 డి డి నాగయ్య నాదస్వరం (విజయవాడనుండి రిలే) 7-45 క-వా, 8-00 అం-వా, 8-15 హిం-వా, 8-30 మధుసూదన్ భావే 8-45 మహ్మద్ ఉస్మాన్ ఘజలే 9-00 ప్రసార సమాప్తి

మ॥ 12-30 మిశ్రమాధురి (క), 12-50 మ-వా, 1-00 మహిళా సమాజం (విజయవాడనుండి రిలే) 1-30 వాద్య గోష్ఠి 1-50 తె-వా, 2-00 వయొలిన్ (క). 2-10 ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2-40 వయొలిన్ (క), 2-50 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు 3-20 ప్రసారం సమాప్తి

3-45 పాఠశాలలకు 4-15 ప్రసార సమాప్తి

సా॥ 5-30 ప్రమీలారావు భజన్ 5-45 హిందూస్థానీ సంగీత పాఠం 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 గ్రామసీమ విశేషాలేమిటి? ఆధునిక గేయము వ్యవసాయ గోష్ఠి ఫిల్మ్ గీతం (క), ప్రసంగము 7-00 తె-వా, 7-15 గ్రామసీమ 7-30 సన్‌సత్తావన్ కాస్వాధీనతా సమర్ ప్రసంగము (హిందీ) 7-45 ఆప్‌కా పత్రిమిలా (ఉర్దూ) 7-50 అమిరపు సుబ్బలక్ష్మి గీతావళి 8-00 మధుసూదన్ భావే రాగ్ పూర్వి కల్యాణ్ 8-30 మర్చియా, నౌహా 8-45 సలామ్, మర్చియా 9-00 అం-వా, 9-15 ఉ-వా, 9-30 ఆనాధనదన నాటిక (హిందీ) 10-00 మధుసూదన్ భావే రాగ్ నాయకీ కానడ 10-30 ప్రసార సమాప్తి

విజయవాడ

357 1 మీటర్లు (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం ,6-35 ప్రసార విశేషాలు 6-40 భక్తిరంజని (ఎ-క) 7-00 తె-వా 7-15 డి డి నాగయ్య నాదస్వరం 7-45 సంగీత శిక్షణ, 8-00 అం-వా 8-15 హిం వా 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు, 1-00 మహిళాసమాజం (హైద్రాబాద్ నుండి రిలే) 1-30 శాస్త్రీయ సంగీతం (క), సప్తగంధర్వ 1-40 హిం-వా 1-50 తె-వా 2-00 వయొలిన్ · నిలయ విద్యాసుడు, 2-10 ఉన్నత పాఠశాల విద్యార్థులకు 2-40 వయొలిన్ , నిలయ విద్యాసుడు, 2-50 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు, 3-20 ప్రసారసమాప్తి.

సా॥ 5-30 డి డి నాగయ్య నాదస్వరం 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు 6-15 గ్రామస్థుల కార్యక్రమము విశేషాలేమిటి? ఆధునిక గేయం వ్యవసాయ గోష్ఠి చెరకు ఉత్పత్తి విధానము చర్చ ఫిల్మ్‌గీతాలు (క) ఆకాలపు వింతవృత్తులు చారులు ప్రసంగము 7-00 తె-వా 7-15 గ్రామస్థుల కార్యక్రమము పురాణ కాలక్షేపం 7-30 ఎమ్ ఎస్. బాలసుబ్రహ్మణ్యశర్మ (ఎ-క) ఎస్. సి హైచ్ కృష్ణమాచార్యులు వయొలిన్ దండమూడి రామమోహనరావు · మృదంగం 9-00 అం-వా 9-15 సాహిత్యనందిని సజలనయనాలు కథానిక అంగర వెంకట సత్యనారాయణరావు 9-30 ఎ ఐ ఆర్ వాద్యబృందము 10-00 బి. ఎస్ రామచంద్రరావు 10-30 ప్రసార సమాప్తి

తెలంగాణ సహకార సంస్థల కన్వెన్షన్

హైద్రాబాద్, ఆగస్టు 4

హైద్రాబాద్ సెంట్రల్ కోఆపరేటివ్ యూనియన్ ఆవరణలో గత గురువారం నాడు అపెక్స్ కోఆపరేటివ్ సంస్థల సమావేశం శ్రీ కోదాటి నారాయణరావు అధ్యక్షతన జరిగినది అందు ఆగస్టు 24 వ తేదీన తెలంగాణా సహకార సంస్థల కన్వెన్షన్‌ను జరుప నిర్ణయించనైనది అందు తెలంగాణా ప్రాంతపు సహకార రంగంలో సాధింపబడిన అభివృద్ధి. ఈ ఉద్యమమునకు సంబంధించిన అధికార అనధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు రెండవ ప్రణాళికలోని సహకార స్కీములు చర్చింపబడగలవు.

కన్వెన్షన్‌కు అవసరమైన ఏర్పాట్లు చేయుటకు ఒక ప్రాతినిధ్య కమిటీ ఏర్పరచబడినది. ఇది 6వ తేదీసాయంత్రం 5 గంటలకు హైద్రాబాద్ కోఆపరేటివ్ యూనియన్ ఆఫీసులో సమావేశం కాగలదు

నారాయణగూడా బాలికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థినుల సంఘ సర్వసభ్య సమావేశం ఆగస్టు 7వ తేదీ సాయంత్రం 4-30 గంటలకు జరిగి నూతన కార్యవర్గం ఎన్నుకొనబడగలదు

ఒలింపిక్ పరుగు

గుబ్బా బుచ్చయ్యగారి వెంకటేశం కమీషన్ ఏజంటు

టెలిఫోన్ నెం 4941

(కల్దారు రేట్లు)

హైద్రాబాదు, ఆగస్టు 3

120 శేర్ల పల్లా ఒక్కంటికి

దొడ్డుబియ్యం	54-0-0	57-0-0
నెంబర్లు కొ॥	58-0-0	62-8-0
సాంబర్లు కొ॥	66-0-0	70-0-0
నూకలు	40-0-0	46-0-0
వరంగల్ సాం॥కొ॥	70-0-0	73-0-0
కందులు పెద్దవి	44-0-0	46-0-0
కందులుచిన్నవి	42-8-0	43-0-0
మినుములు		
సెనగలు	43-0-0	44-0-0
బెల్లం	36-0-0	45-0-0
తెల్లజొన్నలు	48-0-0	52-8-0
పచ్చజొన్నలు	46-8-0	47-0-0
మిరపకాయలు	110-0-0	150-0-0
పసుపు		
పుల్లిగడ్డ కొ॥	34-0-0	36-0-0
చింతపండు కొ॥	28-0-0	40-0-0
తెల్లనువ్వులు	110-0-0	120-0-0
బోధన్ శక్కర (సం॥15)	106-12-0	
పెద్దకందిపప్పు	65-0-0	
చిన్నకందిపప్పు	58-3-0	62-0-0
సెనగపప్పు	55-0-0	
పెసరపప్పు	67-0-0	
మినుపపప్పు	90-0-0	92-0-0
లంకపిండి	53-0-0	54-0-0

12 శేర్ల మణుగు

అల్లం	1-8-0	1-12-0
యెల్లిగడ్డ	4-0-0	7-0-0
పల్కునూనె	17-4-0	
ఆలుగడ్డ	5-0-0	5-6-0

40 శేర్ల మణుగు

నెయ్యి	120-0-0	145-0-0

ఈ ప్రకారము యీరోజు అయిన ధరలు వ్రాయించినాము గిట్టిన సరుకులు పంపవచ్చును తెప్పించుకోవచ్చును

హైచ్. యస్. సి. సప్లిమెంటరీ పరీక్ష

హైద్రాబాద్, ఆగస్టు 4

1957 అక్టోబరులో జరుగనున్న హైచ్ ఎస్ సి సప్లిమెంటరీ పరీక్షలకు, పూర్వ హైద్రాబాద్ రాష్ట్రంలోని మహారాష్ట్ర ప్రాంతంనుండి దరఖాస్తులు ఆయాపాఠశాలలలోగాని లేక స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలలోగాని చేరునట్లు పంపవలసిన చివరి తేది 1957 ఆగస్టు 12 వ తేది లేటు ఫీజుతోసహా పంపుటకు వీలైన చివరి తేది 1957 ఆగస్టు 20 వ తేది

1957 మార్చి హైచ్ యస్ సి పరీక్షకు నిర్ణీతమైన పాఠ్యక్రమాలలో అప్పటి పాఠ్య క్రమము ననుసరించి, అవే నిబంధనలు, అవే పద్ధతులమీద పరీక్షలు నిర్వహింప బడుతవి

హైద్రాబాదు, సికింద్రాబాదు, వరంగల్లు, కరీంనగర్, మహబూబ్ నగర్, గుల్బర్గాలలోని ప్రస్తుత కేంద్రాలుకాక అదనంగా బీదరాబాదులో ఒక పరీక్షా కేంద్రం ఉంటుంది

తెలంగాణాలోని అడవులు

విచక్షణారహితంగా నరకివేత

హైద్రాబాదు, ఆగస్టు 4

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సోషలిస్టు పార్టీ డిప్యూటీ లీడర్ పి నరసింగరావు యింకొక యేడుగురు శాసనసభ్యులు కె రాజమల్లు, జి గంగారెడ్డి, బస్వ మాణయ్య, ఎ మోహన్ రెడ్డి, జి లక్ష్మారెడ్డి, జి సూర్యనారాయణ, సి సోమయాజులు, వ్యవసాయ అటవీ శాఖలమంత్రి పి తిమ్మారెడ్డికి ఒక మెమొరాండాన్ని సమర్పిస్తూ తెలంగాణాప్రాంతంలో అడవులు విచక్షణారహితంగా ధ్వంసం చేయబడుచున్నవని, తెలంగాణా అటవీశాఖ అధికారులలో అవినీతి, లంచగొండితనం అధికంగా కలదని యీ శాఖ కార్యకలాపాల విచారణకు ఒక కమిటీని వేయాలని కోరారు

* రోలెక్స్
* రోమర్
* వెస్టెండ్
* ఫేవర్ లూబా

గడియారముల కొరకు విధ్వంసచర్యలేమి జరగకపోవటం ఏర్పాటు దర్శించండి:-

ఆషా వాచ్ కంపెని.
ఆబిడ్ రోడ్, హైద్రాబాదు
ఫోన్ నె 5518
(K. P)

దృఢగాత్రులందరు ఈ చిత్రమును చూచి వారి అభిప్రాయమును మార్చుకొనెదరు
ముక్తి ఫిలిమ్స్
"జనమ్ జనమ్ - కె- పేరే"
తా॥ నిరూపరాయ్, మన్‌హర్ దేశాయ్, బి.ఎమ్.వ్యాస్, క్రిష్ణకుమారి, సతీష్‌వ్యాస్, మహీపాల్,
దర్శకత్వం:- మనూదేశాయ్. సంగీతం:- ఎస్. ఎన్ త్రిపాఠి. లిరిక్స్:- భారత్‌వ్యాస్.
ప్రభాత్ హైద్రాబాద్.
సోమవారము నుండి ప్రత్యేక మ్యాటినీలు సా॥ 3-30 గం॥
లక్ష్మి - వరంగల్. 15—8—57 నుండి, శారద—నాందేడ్,
(Trupix) శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్.

4 వ మహత్తర వారం
ఉమా పిక్చర్స్ సమర్పించు
"రాజపుత్రి రహస్యం"
(తెలుగు)
తారాగణం: అంజలి, ఎస్. వరలక్ష్మి, ఎమ్. జి. రామచంద్రన్, కన్నాంబ, రేలంగి, యన్. యస్ క్రిష్ణన్, టి. ఎ, మధురం.
మినర్వా సికింద్రాబాదు. కమల్ హయిద్రాబాదు. మార్కండేయ వరంగల్
(Trupix) భమిరియా రిలీజ్

4 వ మహత్తర వారము.
పి. ఎన్. ఫిలిమ్స్ వారి
"సమందర్"
తారలు: ప్రేమ్‌నాథ్, బినారాయ్, హీరాలాల్, ఉల్హాస్.
లిబర్టి హైద్రాబాదు. స్టేట్ హైద్రాబాదు
లిబర్టిలో లోకమాన్యుని జీవితపు న్యూస్‌రీల్ చూపబడుచున్నది
(Trupix) జాగృతి పిక్చర్స్ రిలీజ్

6 వ మహత్తర వారం
చందమామ వారి
* దొంగల్లో దొర *
(తెలుగు)

నటవర్గం: జమున, నాగేశ్వరరావు, గుమ్మడి, జి. వరలక్ష్మి, రేలంగి, హెలెన్ వగైరా.
సాగర్ హైద్రాబాద్, అజంతా సికింద్రాబాద్, రాజరాజేశ్వరి వరంగల్.
(C'ma) నవయుగ రిలీజ్

8-8-1957 నుండి గొప్ప విడుదల.
చేతన్ ఆనంద్ వారి
* అంజలి *
తా॥ సిమ్మి, శీలారమణి, సితార, చేతన్ ఆనంద్, సప్రు కుమ్‌కుమ్, రాజ్‌కుమార్

ఒకే పర్యాయము
దీపక్ హైద్రాబాదు మహల్ హయిద్రాబాదు. కమల్ సికింద్రాబాదు ప్లాజా
ఎక్కువ తరగతులకు అడ్వాన్సు బుకింగ్.
ఉ॥ 11-0 నుండి సా॥ 1-0 గం॥ వరకు.
దిల్‌షాద్ ప్రయివేట్ లిమిటెడ్ విడుదల

హైద్రాబాద్ రాక

కవిరాజ్ పండిట్ దుర్గాదత్త శర్మ వైద్య వాచస్పతి ప్రపంచ ప్రఖ్యాత "నవరత్న కల్ప"

కనిపెట్టిన వారు
హైద్రాబాద్ నందు
ప్రతి నెల 27 వ తేదీన
తాజ్ మెహల్ హోటల్
కింగ్ కోఠిరోడ్
ఫోన్ 5591 సంప్రదించవచ్చును
సంప్రదించు వేళలు
ఉ॥ 9-0 గం॥ నుండి 12-30 వరకు
మ॥ సా॥ 4-0 గం॥ నుండి 7-30 గం॥ వరకు వారిని కలిసి సలహా పొందవచ్చును కార్యక్రమం తప్పకుండుటకు వీరు విమానములో ప్రయాణము చేసెదరు

"నవరత్న కల్ప" వాడండి

రవలు, రత్నములు, ముత్యములు, పగడము, పచ్చ, గోమేధికము, నీలము, నీలమణివైరా నవరత్నములతో తయారుచేయబడినది

అన్నివిధములైన దీర్ఘవ్యాధులకు అమోఘమైన మందు
సుస్థిర ఆరోగ్యమును పొందుటకు
ఇది ఒక్కటే దివ్యౌషధము
అన్ని క్యాంపుల అడ్రసులకు, ఉచిత లిటరేచరుకు వ్రాయండి

Navaratna Kalpa
Pharmacy
Jalandhar City (India)

భారత ప్రభుత్వ

ఆహార మరియు వ్యవసాయపు మంత్రాంగము

రెండరు నోటీసు నెం సిఎల్-1/78623/57/ఎ

రీజనల్ డైరెక్టర్ (ఆహార) సగరన్ రీజన్, మద్రాసు వారు [illegible] తరపున ఆహార ధాన్యాలు కోరినారు. పప్పులు, చక్కెర, మునుగాగ వాణిజ్య పరకులను భారత ప్రభుత్వముచే కాకినాడ పోర్టుకు 15-10-1957 నుండి ఒక సంవత్సరమువరకు దిగుమతి చేయుటకుగాను కంట్రాక్టర్ల నియమించుటకు రెండర్లు కోరుచున్నారు దరఖాస్తుదారులు ఈ నోటీసు వివరములను దరఖాస్తు ఫారములతో జతపరచవలెను రెండరు ఫారములు (మార్చుటకు వీలులేదు) పై కార్యాలయము నెం 20, లక్ష్ అవెన్యూ మంగళ విలాస్, మైలాపూర్ మద్రాసు 4 నుండి ఫారమునకు రు 5/- నగదులో (వాపసు ఇవ్వబడదు) చెల్లించిన పొందవచ్చును దరఖాస్తులు 26-8-1957 సా॥ 4-0 గం॥ వరకు అందజేయవలెను

DA-470(18)

కావలెను

లైఫ్ ఇన్స్యూరెన్స్ కార్పొరేషన్ యొక్క సబ్సిడరీ జనరల్ ఇన్స్యూరెన్సు కంపెనీ ప్రాతినిధ్యము నిర్విహించుటకు సికింద్రాబాద్, హైద్రాబాద్ జంటనగరములలో ఒకరు, మరియు వరంగల్ నందు ఒకరు పలుకుబడి, సామర్థ్యము గల ఆఫీసర్లు కావలెను.

అనుభవముకల వారు మాత్రమే దరఖాస్తులు పంపవలెను.

బాక్స్ నెం: 880.
C/o గోలకొండ పత్రిక
హైద్రాబాద్-(ద)

రైల్వేసర్వీస్ కమీషన్, మద్రాసు

ఎంప్లాయిమెంట్ నోటీస్ నెం· 10/57/826

సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ డివిజన్‌నందు రు 60-150, స్కేలులో క్లెర్కులు (సిగ్నల్ మరియు టెలి- కమ్యూనికేషనల్) 12 పదవులకు దరఖాస్తులు కోరబడుచున్నవి (నిమ్నతరగతులకు రెండు పదవులు, కొండజాతులవారికి ఒకటి, ఆంగ్లో ఇండియన్‌లకు ఒకటి రిజర్వుచేయబడినవి)

వయస్సు: 1-8-1957 కు 18-30 సం॥ ల మధ్య వయస్సు గలిగి యుండవలెను

యోగ్యతలు: మెట్రిక్యులేషనులో సబ్జెక్టులేనియెడల, విడిగా ప్రభుత్వ డ్రాయింగ్ పరీక్షలో ప్యాసయి మెట్రిక్యులేషను దానికిసమానమైన పరీక్షప్యాసయి యుండవలెను

అభ్యర్థులు టైపింగ్‌లో పూర్వానుభవము కలిగియుండవలెను

2 నిమ్నతరగతులు, కొండతరగతుల అభ్యర్థులకు 5 సం॥ లు రిజర్వ్డ్ స్థానములకు 40 సం॥ వరకు వయస్సు పరిమితిసడలింపబడును మరియు భోనఫయిడ్ కాందిశీకులు, వార్ సర్వీస్ అభ్యర్థులకు వార్ సర్వీస్ చేసినంతవరకు 40 సం॥ ల వరకు సడలింపబడును అట్టి అభ్యర్థులు దరఖాస్తులను ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజిద్వారా పంపవలెను

3 నిర్ణీత దరఖాస్తుఫారములను ముఖ్యమైన రైల్వేస్టేషనులు ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజీలనుండి రు 1/ (నిమ్నతరగతులు, కొండజాతులు మరియు కాందిశీలు 25 నయాపైసలు) చెల్లించి పొంది అట్టిఫారములపైనే దరఖాస్తులను పూర్తిచేసి సెక్రెటరీ, రైల్వే సర్వీస్ కమీషన్, త్యాగరాయనగర్ మద్రాసు 17 కు 28-8-1957 లోపు అందునట్లు పంపవలెను

అభ్యర్థులు తమ దరఖాస్తులవెంట స్వంతఅడ్రస్ (18 నయాపైసలు) స్టాంపులు వరును జతపరచినయెడల అట్టి దరఖాస్తుల ఫలితములు తదువాత తెలుపబడును.

Edited Printed and Published by N Narothama Reddy MA for the Golkonda Publications Ltd at the Golkonda Press Hyderabad.

పునరావాసకల్పన

దేశ విభజనానంతరం తూర్పు-పశ్చిమ పాకిస్థాన్‌లనుంచి, భారతదేశానికి వలస వచ్చిన నిర్వాసులకు పునరావాస సౌకర్యాల కల్పన ఒక పెద్ద సమస్య అయింది 1956 వ సంవత్సరం ఆఖరువరకూ 87 20 లక్షల మంది నిర్వాసులు భారతదేశానికి వలస వచ్చారు వారిలో 47 20 లక్షల మంది పశ్చిమ పాకిస్థాన్ నుంచి వచ్చారు పశ్చిమ పాకిస్థాన్ నుంచి వచ్చిన నిర్వాసుల ప్రవాహం కొలది సంవత్సరాల క్రిందటే నిలిచిపోయినందున వారికి పునరావాస సౌకర్యాలు కల్పించడం దాదాపుగా తొలి పంచవర్ష ప్రణాళికా కాలం గడువులోగా పూర్తయింది

తూర్పు పాకిస్థాన్ నుంచి నిర్వాసులు వలస రావడం నిరంతరంగా కొనసాగుతున్నందున వారికి పునరావాస సౌకర్యాల కల్పన కూడా నిరంతర సమస్య అయింది 1956 ఆఖరు వరకూ తూర్పు పాకిస్థాన్ నుంచి 40లక్షల మంది భారతదేశానికి వలస రాగా 30 లక్షల మంది పశ్చిమ బెంగాల్‌లో స్థిరపడినారు

పునరావాస సౌకర్యాల కల్పన కృషి కడు సమర్థతతో జరుగుతున్నది అందువలన సుమారు 4 లక్షల కుటుంబాలకు భూ వసతులు దానికి సంబంధించిన యితర వృత్తులు కల్పించబడినాయి ఆ కుటుంబాలకు ఋణాలుగా యివ్వబడిన మొత్తం 20 10 కోట్ల రూపాయలు అవిగాక ఒక లక్షకు పైగా కుటుంబాలకు నగర ప్రాంతాలలో స్థిరపడడానికి 11 24 కోట్ల రూపాయలు ఋణంగా యివ్వబడినాయి ఇవిగాక 16,000 వసతి గృహాలు, 600 వసతి వాడలు నిర్మించబడినాయి

పునరావాస కల్పన కార్యక్రమం ఆర్థిక, సాంఘిక పురోభివృద్ధి కార్యక్రమాలలో ఎక్కువగా సమన్వయించబడి నిర్వహించబడుతున్నాయి పశ్చిమ బెంగాలులోని నిర్వాసులు తమకోసం నిర్మింపబడే వసతి వాడలు, గృహాల నిర్మాణానికి తోడ్పడుతున్నారు

1 వ చిత్రం - తూర్పు పాకిస్థాన్ నుంచి వచ్చిన ఒక నిర్వాసి తన కొత్త నేత యంత్రంమీద పని చేస్తున్నాడు
2 వ చిత్రం - తూర్పు పంజాబులోని పంట కోతల దృశ్యం అనేక వేల నిర్వాసి కుటుంబాలు అక్కడ నివాసం యేర్పరచుకున్నాయి
3 వ చిత్రం - పశ్చిమ బెంగాలులోని ఒక నిర్వాసుల వసతివాడలోని మహిళా శిక్షణకేంద్రంలోని లోపలి దృశ్యం
4 వ చిత్రం - న్యూఢిల్లీలోని ఆరబ్‌కీ సరాయ్‌లోగల పారిశ్రామిక సాంకేతిక శిక్షణ కేంద్రంలో పని నేర్చుకుంటున్న యిద్దరు సభ్యులు

రేడియో ప్రసారాలకు అనువైన భాష

శ్రీ ఆర్. సి. టాండన్

రేడియో ప్రసారాలలో వుపయోగించబడుతున్న భాషనుగురించి రెండు విస్పష్టమైన భిన్నాభిప్రాయాలున్నాయి మాట్లాడేభాషకు, వ్రాసే భాషకు మనం వూహించేదానికంటె పెద్ద వ్యత్యాసమున్నదనే అభిప్రాయము ఒకటి ఆ రెంటికీగల తేడాలను గోరంతని కొండంతలు చేస్తున్నారనేది రెండవ అభిప్రాయం అయితే రేడియో ప్రసారాలకు అనువైన భాషయొక్క లక్షణాలు ఏమిటి అని నిర్ధారణ చేయవచ్చేసరికి పయిన పేర్కొన్న రెండు అభిప్రాయాల వారికి తేడా కన్పించక పోవడమే ఆశ్చర్యకరమైన విషయం

రేడియో ప్రసంగాలలో యెక్కువ భాగం శ్రోతలకు నచ్చకపోవడానికి కారణం వాటిని యెవరో చదువుతున్నట్లు శ్రోతలకు అనిపించడం ఎందువల్లనంటే దాదాపుగా రేడియో ప్రసంగాలు సాహిత్యశైలిలో రచించబడుతున్నాయి గాని వాడుకభాషలో కాదు సంభాషణలకు ఉండవలసిన సహజలక్షణాలు వాటిలో లోపిస్తున్నాయి

కొన్ని ప్రసంగాలను మాత్రం, వాటిని రచించిన వ్యక్తుల యొక్క వ్యక్తిగత గౌరవాన్నిబట్టి శ్రోతలు వినడం జరుగుతోంది తప్ప, అనేక మంది ప్రసంగాలను శ్రోతలు వినరు శ్రోతలకు విసుగెత్తి లేచిపోతున్నారు వాడుకభాషలో రచన చేయలేనివారు శ్రోతలను మెప్పించలేరు

మంచి రేడియో రచనకు లక్షణం సజీవమైన స్వతస్సిద్ధమైన సంభాషణలతో, వ్యక్తి ఎదురుగా వుండి మాట్లాడుతున్నట్టు వుండడం అందరికీ అర్థమయ్యే భాషాలతో పొదగబడి వుండాలి

సంభాషణలో వుపయోగించే సంక్షిప్తమైన పదాలు వుండవచ్చును క్రియాశూన్యమైన పదజాలం వుండవచ్చును వ్యాకరణ నిబంధనలు వర్తించని కొన్ని మాటలు వుంటే వుండవచ్చును

వాడుకభాషలోని జాతీయాలతో రచన సాగినట్లయితే, సరైనమాట కోసం తడుముకోవడం వుండదు వాడిన మాటను తిరిగి వుపయోగించనవసరం లేదు వాక్యాలు చిన్నవిగాను, శక్తిమంతంగాను, సూటిగాను వుంటాయి భాష సరళంగా వుంటుంది వ్రాసే భాషలో సాధారణంగా వుండే "పైన పేర్కొన్న, వెనుకటి, తర్వాత," మొదలైన సూచికాపదాలు ఇందులో వుండవు

అయితే మంచి రేడియో ప్రసంగం, చక్కటి రచన కూడా అయి వుంటుంది కేవలం మైక్రోఫోను ఎదుట చదవడానికి మాత్రమే ఆ రచన తయారు చేసినా అది తర్వాత వ్యాస రూపంలో ముద్రించబడుతుందికూడా. సక్రమమైన రేడియో రచన, దాని సైలిదృష్ట్యా వ్యాసరూపంలో ప్రచురించడానికి పనికిరాదని చాలమంది అనుకుంటారు అది చాల పొరపాటు అభిప్రాయం

రేడియో రచనలలో చాలభాగం పత్రికలలో ప్రచురించబడుతున్నాయి. మరికొన్ని గ్రంథరూపంలో ప్రకటించబడుతున్నాయి

పాఠకులకు అనేక గ్రంథాలున్నాయి రేడియో రచనను ప్రచురించేటప్పుడు సంభాషణలలోని కొన్ని సంక్షిప్తపదాలను మార్చటం, శ్రోతలకుద్దేశించిన కొన్ని పదాలను, మార్చడం సంభవిస్తున్నది మిగతా విషయాలలో భాషలోవున్నవాడుక జాతీయాలు ముద్రణకు ఎందుకు పనికిరావో అర్థం కావడంలేదు ఇంకో విషయాన్ని కూడా ఈ సందర్భంలో జ్ఞాపకం ఉంచుకోవాలి రేడియోరచనలు మన భాషలన్నింటిలోని ప్రసంగాల యొక్కా, రచనల యొక్కా, ప్రమాణాలను పెంపొందించాలి

వాడుకభాషను పునరుద్ధరించ వలసిన అవసరం ఈనాడు ఎంతయినా ఉన్నది భాషఅనేది మాట్లాడేమాటల పైన కంఠస్వరం యొక్క లయమీద యెక్కువగా ఆధారపడి ఉన్నది

రచయిత తన రచనను సాగించేటప్పుడు పదాలు లోపలినుంచి దొర్లుకు వస్తాయి

మాట్లాడేమాటలను వ్రాసినమాటలను కలిపి వాడితే భాషాభివృద్ధికి విశేషంగాతోడ్పడుతుంది ఈనాడువాడుక భాష పునరుద్ధరణ ఎంతో అవసరం. భాష యొక్క ప్రమాణాలను పెంపొందించడానికీ, భాషా సమైక్యాన్ని సాధించడానికి ఆల్ ఇండియా రేడియో ఉత్తమసాధనం గత10సంవత్సరాల్లోను ఆలిండియా రేడియో భారతదేశంలోని అన్ని భాషలలోను ఇట్టి సమైక్యాన్ని సాధించడానికి ప్రశంసనీయమయిన కృషిని చేసింది అయితే ఇక ముందు జరుగవలసినప్రయత్నం ఎంతో ఉన్నది

కాశ్మీర్ సమస్యపై ఇండియారు నేపాల్ మద్దతు

నేపాల్ నూతన ప్రధాని ప్రకటన

ఖట్మాండూ, ఆగస్టు 4

"కాశ్మీర్ పూర్వంనుంకీ భారతదేశ అంతర్భాగమే కాశ్మీర్ ప్రజలు భారతదేశంలో ఉండిపోవుటకే నిర్ణయించారు" అని నేపాల్ ప్రధానిడాక్టర్ కె ఐ సింగ్ నేడు ప్రకటించారు

హైదరాబాదు రేడియో కేంద్ర అభివృద్ధి 2

(శ్రీ బి- ఎస్- రాజరెడ్డి)

ప్రభుత్వం ఆశించిన హిందూస్థానీ, కర్ణాటక సంగీతాలు ఐక్యతపొంది, భారతీయ సంగీతం ఇంతవరకు కొంచెమైనా సాధించకపోగా ఎవరి సంగీతాన్ని వారు మరింత కట్టుదిట్టంగా గానం చేస్తున్నారు దీనికి కారణం సువిదితం, ఒక రకమైన సంగీతంలో పాండిత్యం సంపాదించినవారు, తమ తమ బాణీలలోని గమకాలను వదనాడకోలేరు వయస్సు మళ్ళిన వారికి మరింత దుస్సాధ్యం పోతే వీరిని పోషించేది, విని ఆనందించేది ఆయా ప్రాంత ప్రజలు ప్రజలు తమకు నచ్చితే గాని విరరు వారికి నచ్చేది, తరతరాల నుండి పాంప్రదాయంగా వస్తున్న సంగీతమే ఇది మారాలంటే జాతీయ కార్యక్రమాలు చాలవు అందుకై ప్రభుత్వం చేయవలసిందే మంటే, రెండు రకాల సంగీతం ఎక్కువగా ఒకే కేంద్రంనుండి వినే ప్రజానీకం ద్వారా భారతీయ సంగీతం సాధించాలి ఇటువంటి సౌకర్యంగల కేంద్రాలు భారతదేశంలో కొద్ది అందుకై ఢిల్లీ కేంద్రం, మద్రాసు కేంద్రం కొంతవరకు ప్రయత్నించినా అనుకున్నంత త్వరగాసాధించలేవు ఇందుకు భారతదేశం మొత్తంమీదసౌకర్యంగల ప్రదేశం ఆంధ్రప్రదేశ్ రాజధానియైన హైదరాబాద్ కేంద్రం హైద్రాబాద్ పట్టణం భారతదేశానికి కొంచెం దక్షిణంగా మధ్యలోయుంది ఈ పట్టణానికి ఉత్తరాన సుమారు 5 వందల మైళ్ళవరకు హిందుస్తానీ సంగీత ప్రభావం బాగా యుంది, దక్షిణాన కర్ణాటక సంగీత సాంప్రదాయం పూర్ణంగా యుంది ఈ పట్టణంలో హిందుస్తానీ సంగీతంలో కృషి చేసేవారు ఎక్కువగా ముస్లిం, మహారాష్ట్రీగాయక,గాయనీమణులు చాలా మంది యున్నారు కర్ణాటక సంగీతం విరివిగా ప్రారంభమైంది ఈ కేంద్రం నుండి రెండు రకాల సంగీతాన్ని వినే ప్రజలు అధికసంఖ్యాకులుగా యున్నారు పూర్వసాంప్రదాయాలకు అలవాటుపడిన ప్రజలు, భావి సంతతి కలసి భారతీయ సంగీతానికి ఈపట్టణం నుండి యిచ్చినంత ఘనమైన స్వాగతం దేశంమొత్తంమీద మరేప్రాంతంనుండి కూడాని గట్టిగా చెప్పగలను ఈ పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు ఈ కేంద్రం నుండి జరిగే కృషిద్వారా భారతీయ సంగీతాన్ని వినిపించగల వాతావరణాన్ని సృష్టించగలరు

కేంద్రప్రభుత్వం హృదయ పూర్వకంగా భారతీయైక్యత, ఏక సంగీతం వాంఛిస్తున్నట్లయిన హైదరాబాద్ పట్టణ ప్రాముఖ్యాన్ని ఇచ్చటి రేడియో కేంద్ర ప్రాముఖ్యాన్ని తప్పక గుర్తించవలెను

హైద్రాబాద్ రేడియో కేంద్రంలో పెట్టకలిచిన 10 కి వా షార్టువేవ్ యంత్రాన్ని త్వరగాఏర్పాటుచేయాలి తరువాత 50 కి వా మీడియమ్ వేవ్ యంత్రాన్ని మరొకటి స్థాపించాలి ఇప్పుడు ఇక్కడ ఏర్పాటు చేయబోయే (మరొకచోట తీసివేసినది) 5 కి వా ప్రసారయంత్రము 80 మైళ్ల వరకు మాత్రమే శక్తివంతముగా పని జేయగలదు 50 కి వా ప్రసారయంత్రమైతే 5 లేక 6 వందల మైళ్ళ వరకు వివరంగా వినిపించే శక్తిగలదగును అప్పుడు నవ గాయకులకు ఉభయ సంగీతాలలో అంత్యపోటీలు ఇక్కడ ఏర్పాటుచేయవచ్చు హైద్రాబాద్ కేంద్రంగా ప్రభుత్వానికి కొంత ఖర్చు తగ్గుతుంది. ఈ రేడియో స్టేషన్ లలో నిలయ విద్వాంసులను పెంచిన అన్ని కార్యక్రమాలకు నిండుతనం రాగలదు ఈ సూచనలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి పెద్దలంతా కలుగజేసుకొనితెచ్చి హైద్రాబాద్ రేడియో కేంద్ర అవసరాలను గుర్తించగలిగేట్లు కేంద్రమును ఒత్తిడిచేయుట అవసరం

రాష్ట్రపతితో భూదాన కార్యకర్తల గోష్ఠి

హైద్రాబాద్, ఆగస్టు 4

రాష్ట్రపతి నిలయంలో యీవేళ తనను కలిసిన కొందరు భూదానోద్యమ కార్యకర్తలతో రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ గోష్ఠి జరిపారు వారు తమ అనుభవాలను రాష్ట్రపతికి వివరిస్తూ అనేక గ్రామాలలో భూదానపు మౌనవిప్లవం ఫలితాలు సాధిస్తున్నదని తెలిపారట

రాష్ట్రపతి నేడు రాజభవన్‌లో గవర్నర్ శ్రీ సాచార్‌తో విందు గుడిచారు రాష్ట్రపతి నిలయంలో తంజావూరు బృందమేళకాటి భజన కార్యక్రమం నిర్వహించింది

పత్రికా ప్రతినిధులతో డాక్టర్ సింగ్ మాట్లాడుతూ, కాశ్మీర్‌పై విదేశీయుల దురాక్రమణను ఖండించారు కాశ్మీర్ సమస్యపై భారతదేశాన్ని నేపాల్ సంపూర్తిగా బలపరుస్తున్నదని కాశ్మీర్ ప్రజలు భారతదేశంలోనే ఉండిపోవ నిర్ణయించుకొన్నందుకు అభినందిస్తున్నామని ప్రకటించారు వీరు.

సమ్మెల కిప్పుడు సమయం కాదు

(1 వ పేజీ తరువాయి)

యేషన్ సభ్యులు ఉచితంగా ప్రభుత్వానికి సాయపడగలరని వ్యక్తపరుపబడింది

హైద్రాబాదు ఎన్ జి. ఓ ల దృక్పథం

హైద్రాబాదు నాన్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ అత్యవసర సమావేశంలో నేడు కేంద్ర ప్రభుత్వోద్యోగులు సమ్మెచేస్తే అందువల్ల యేర్పడే ఖాళీల్లో ఎన్ జి ఓ లు పనిచేయరాదని తీర్మానించింది గట్టిబద్ధంగా గాని లేక పరిపాలనా వ్యవహార బద్ధముగాగాని రాష్ట్ర ప్రభుత్వానికి తమ ఉద్యోగులను కేంద్ర ప్రభుత్వ ఖాళీల్లో పనిచేయుమని బలవంతపెట్టే హక్కు లేదని అందు ఉటంకించబడింది

మద్రాసు ఎన్. జి ఓ ల తీర్మానం

తమిళనాడు ఎన్ జి ఓ ల సంఘం కార్యవర్గం నేడు అత్యవసరం సమావేశంజరిపి పార్లమెంటులో నిన్న కేంద్రార్థికమంత్రి ప్రకటించిన రెండోపే కమిషన్ విచారణాంశాలపట్ల అసంతృప్తి వెల్లడించింది ఈ పే కమిషన్ ఎన్ జి ఓ ల జీతాల పరిస్థితికూడా పరిశీలించేందుకు ఉద్దేశింపబడాలని కోరుతూ తీర్మానించింది కూడా కేంద్రోద్యోగులు సమ్మెచేస్తే యేర్పడే ఖాళీల్లో అధికారులు దేశించిన పని చేయవద్దని రాష్ట్ర ఎన్ జి ఓ లకు యీ సమావేశం సలహానిచ్చింది

కేంద్ర ఉద్యోగుల కోర్కెలను మద్రాసురాష్ట్ర ఎన్ జి ఓ ల సంఘం బలపరుస్తూ వారు సమ్మెచేసినప్పుడు యీ ఎన్ జి ఓ లను వారికి బదులు పనిచేయడానికి ఆదేశించి తమను యిబ్బందికర పరిస్థితిలో పెట్టవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి కూడా యీ సమావేశం సలహాయిచ్చింది

సోషలిస్టుపార్టీ సానుభూతి

తంతి తపాలా పనివారు ప్రారంభింపదలచిన సమ్మెపట్ల తన పూర్తి మద్దతును ప్రకటిస్తూ నేడు సోషలిస్టు పార్టీ కార్యవర్గం తీర్మానించింది కేంద్ర ప్రభుత్వ విధానాన్ని నిన్న లోకసభలో ప్రవేశపెట్టబడిన అత్యవసర సర్వీసులచట్టాన్ని విమర్శిస్తూ యీ చర్యలవల్ల ఉద్యోగుల్లో తీవ్ర వ్యతిరేకత ప్రబలగలదని తీర్మానంలో సోషలిస్టుపార్టీ జాతీయ కమిటీ పేర్కొన్నది

సమ్మెలో కమ్యూనిస్టుల పాత్ర

కేంద్రప్రభుత్వోద్యోగులసంయుక్త చర్యాసమితి సమావేశకర్త హోదాలో ప్రముఖ కమ్యూనిస్టు నేత్రీడ్ యూనియన్ నాయకుడు శ్రీ ఎన్ సత్యనారాయణరెడ్డి 6వ తేదీ సాయింత్రం 7 గంటలకు ప్రతాపగిరిజీ కోఠిలో "ప్రధాన సర్వీసుల నిర్వహణ బిల్లు" అనే పేరుతో కేంద్రప్రభుత్వము ఒక బిల్లునుతెచ్చి 5 లక్షల కేంద్రప్రభుత్వోద్యోగుల సమ్మెను నిషేధించుటకు నిరంకుశాధికారములనుతమచేతిలోనికి తీసుకొన ప్రయత్నించుచున్నందున" ఒక నిరసన సభ ఏర్పాటు చేశారు ప్రభుత్వం ఉద్యోగుల కోర్కెలను నిరాకరించుటచే గత్యంతరంలేకనే 8వ తేదీ రాత్రి 12గం॥లనుండి సమ్మె చేయుటకు నిర్ణయించుకున్నారని ఆయన ఒక కరపత్రంలో పేర్కొన్నారు

తొలగించబోలేని మనహక్కులను నులిపివేసే కేంద్రప్రభుత్వ బిల్లును ఎదిరించాలనీ మన హక్కులకొరకు, అధిక ధరల అలవెన్సు పెంపుదల సాధించుటకు దృఢసంకల్పంతో ఐక్యతతో పోరాటాన్ని సాగించాలనీ సక్రమమైన పద్ధతులకొరకు రెండవ-పే-కమిషన్ నిర్మాణముకొరకు పోరాడాలనీ శ్రీసత్యనారాయణరెడ్డిపిలుపునిచ్చారు

బొంబాయిలో ప్రదర్శన

నిన్న లోకసభలో కేంద్రప్రభుత్వం ప్రతిపాదించిన అత్యవసర సర్వీసుల బిల్లును నిరసిస్తూ బొంబాయి సివిల్ ఏవియేషన్, తపాలాశాఖ ఉద్యోగుల 500 మంది నేడు నినాదాలుచేస్తూ ఊరేగింపును తీశారు తర్వాత జరిగిన బహిరంగసభలో నినాదాలకు అనుగుణంగా తీర్మానం కావించబడింది

ఇరాక్ యువరాజు ఫార్మోజా పర్యటన

బాగ్దాద్, (ఇరాక్) ఆగస్టు 4

ఇరాక్ యువరాజు అబ్దుల్లా జాతీయ చైనా అధ్యక్షుడు చాంగ్ కైషేక్ ఆహ్వానాన్ని స్వీకరించి ఫార్మోజాలో పర్యటించడానికి అంగీకరించారు ఇకా తేదీ నిర్ణయం కాలేదు

దక్షిణవీత్నాంచే టునీషియా గుర్తింపు

సైగాన్, ఆగస్టు 4

టునీషియా రిపబ్లిక్‌ను దక్షిణ వీత్నాం ప్రభుత్వం గుర్తించినట్లు నేడు ప్రకటింపబడింది ఈ విషయం తెలుపుతూ టునీషియా విదేశాంగశాఖకు దక్షిణ వీత్నాం విదేశాంగశాఖనుండి లేఖ పంపబడింది



అమెరికా విమానదళానికి చెందిన కెప్టెన్ జె డబ్ల్యు కిట్టింకర్ యీ మధ్య పెద్దప్లాస్టిక్ బెలూన్‌కు తగిలించబడి సీలుచేయబడిన మెటల్ కాప్సుల్‌లో (ఖనిజంతో తయారైన గొట్టం) 98 వేల అడుగుల ఎత్తుకు (18 మైళ్ళు) ఎగురగలిగాడు మునుపు యీ విధంగా ప్రయాణం చేయబడిన ఎత్తు 76 వేల అడుగులు మాత్రమే మారుపుడు ఎంత ఎత్తువరకు ఏ పరిస్థితుల్లో ప్రయాణం చేయవీలవుతుందన్న విషయంమీద శాస్త్రీయ పరిశోధనలకు యీప్రయోగం ఉద్దేశించబడింది

దక్షిణ భారత హిందీ ప్రచార సభ ఆంధ్ర

స్థాపనా సమావేశ వివరాలు

హైద్రాబాద్, ఆగస్టు 4

ది 28-7-1957 సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రతాపగిరిజీ కోఠిలో ఆంధ్ర రాష్ట్ర హిందీ ప్రచార సంఘం, హైదరాబాదు హిందీ ప్రచార సంఘముల సంయుక్త సర్వసభ్య సమావేశం శ్రీ స్వామి రామానంద, తీర్థగారి అధ్యక్షతన జరిగినది ఆంధ్ర హైదరాబాదు హిందీ ప్రచార సంఘముల విలీనీకరణమునకు తీర్మానించబడినది కొద్ది సవరణలతో సభ నియమావళి అంగీకరింపబడి సంస్థకు "దక్షిణ భారత హిందీ ప్రచార సభ, ఆంధ్ర" అనే నామకరణము చేయబడినది శ్రీ బి గోపాలరెడ్డిగారు అధ్యక్షులుగాను శ్రీ అల్లూరి సత్యనారాయణ రాజు, శ్రీ డాక్టర్ యమ్ చెన్నారెడ్డిగారలు ఉపాధ్యక్షులుగను మరి 14 సభ్యులతో కార్యవర్గము ఏకగ్రీవముగా ఎన్నుకొనబడినది కార్యవర్గ సభ్యులలో తెలంగాణఘనుండి శ్రీ జి యస్ మేలుకోటి, శ్రీ స్వామి రామానంద తీర్థ, శ్రీ కె వి నరసింగరావు శ్రీ రాధాకృష్ణ జోషీ, శ్రీ హీరాలాల్ మోరియా, శ్రీ ఉ రాఘవాచార్యులుగారలు సభ్యులుగా ఎన్నుకొనబడిరి (1) శ్రీ కె వెంకటస్వామి నాయుడు, (2) శ్రీ కె వి రంగారెడ్డి (3) శ్రీ రామకృష్ణ ధూత్ (4) ఎర్నేని లక్ష్మీనారాయణ చౌదరి, (5) శ్రీ అయ్యదేవర కాళేశ్వరరావు గారలు సభ్యులుగా ఒక ట్రస్టు బోర్డు కూడా ఎన్నుకొనబడినది ఆంధ్రనుండి శ్రీ శ్రీనివాస అయ్యంగారు, ఎ బి నాగేశ్వరరావు, శ్రీశిల్ల బ్రహ్మయ్య శ్రీ ఆదుర్తి సూర్యనారాయణ మూర్తి మొదలగువారు కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొనబడిరి

దక్షిణ భారత హిందీ ప్రచారసభ, మద్రాసు కార్యవర్గము వారి అంత్య నిర్ణయము జరిగిన వెంటనే కొత్త సంస్థ కార్య కలాపములు ప్రారంభింపబడగలవు ఈ సంస్థ కార్య కలాపములు నడపుటకు కేంద్ర సభ వారిచే ఒక కార్యదర్శి నియమింపబడును

సంపూర్ణ ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వము, కేంద్ర సభ కూడ హిందీ ప్రచార కార్యక్రమంలో వెనుకటి కంటె ఎక్కువగా ఈ సంస్థకు తోడ్పడగలరని విశ్వసింప బడుచున్నది.

శ్రీమతి పారిజాతం నాయుడు

ఇండోనీషియా ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితి సంక్షేమ సలహాదారుగా నియామకం

న్యూఢిల్లీ, ఆగస్టు 4

ప్లానింగు కమీషనులో సాంఘిక సంక్షేమ వ్యవహారాల ఉపముఖ్య ఉద్యోగిగావున్న శ్రీమతి పి పారిజాతం నాయుడు ఇండోనీషియా ప్రభుత్వానికి ఐక్యరాజ్య సమితి సాంఘిక సంక్షేమ సలహాదారుగా నియమించబడ్డారు

శ్రీమతి నాయుడు మద్రాసు మీదుగా జకార్తాకు బయలుదేరారు.

శ్రీమతి పారిజాతం ప్లానింగు కమిషనులో ముందు మద్రాసు ప్రభుత్వ శాఖలో ప్రధాన సంక్షేమ పనిచేశారు భారతదేశం ఇచ్చిన ఫెల్లో షిప్పుపైన వెళ్ళి అక్కడి సంక్షేమ కార్యక్రమాలను పరిశీలించి వచ్చారు

వెండి, బంగారు ధరలు

సముద్రాల రాఘవులుగారి చంద్రయ్య దుకాణం
సిద్దంబర్ బజార్
హైద్రాబాద్, ఆగస్టు 3

బంగారం	106-0-0
అశోక్ చిప్‌లు	107-4-0
సవరను	71-4-0
వెండితు- 100 కి	181-0-0
వెండితు- 1 కి	1-18-8

అమ్మకమునకు

మా వద్ద వివిధ సైజుల సెకండు హ్యాండు ఇనుప ఛేసులు దొరుకును

వెల సొంతముగా పరిష్కరించుకొనవచ్చును

మేనేజరు
గోలకొండ పత్రిక

గోలకొండ పత్రిక

చందారేట్లు

సంవత్సరమునకు	రు 27/-
అర్ధ సంవత్సరము	రు. 14/-
మూడు నెలలకు	రు. 7/-
ఒక పత్రిక వెల	7 నయాపైసలు

మూడు నెలలకు తక్కువకాలమునకు చందా తీసికొనబడదు

మేనేజరు
గోలకొండ పత్రిక